www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 18 | మంగళవారం | 2 జులై 2024



భారత్ విజయభేరీ

8 లో..

# త్వరలో కేబినెట్ విస్తరణ?

## గవర్నర్ రాధాకృష్ణన్‌తో సీఎం రేవంత్ భేటీ



### అసెంబ్లీ సమావేశాలపై చర్చ
### మంత్రివర్గం విస్తరణపై ఊహాగానాలు
### నామినేటెడ్ ఎమ్మెల్సీలపై చర్చ?

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** రాష్ట్ర కేబినెట్‌ను విస్తరించనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. రానున్న కొన్ని రోజుల్లో కేబినెట్ విస్తరణ ఉండనున్నదన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ముఖ్యమంత్రి గతవారం ఢిల్లీకి వెళ్లి అక్కడ కాంగ్రెస్ ప్రధాన నాయకులతో సీఎం కేబినెట్ విస్తరణ గురించి చర్చించినట్లు తెలిసింది. ఐదు నుంచి ఆరుగురు మంత్రులను కేబినెట్‌లోకి తీసుకోవడం ఖరారైందని తెలుస్తోంది. మంత్రి పదవులు వస్తాయని చాలా మంది

మిగతా 2 లో




# జగిత్యాలకు శని వదిలింది

## ఎమ్మెల్యే సంజయ్‌కు కేటీఆర్ చురకలు

- ఎంగిలిమెతుకుల కోసం సంజయ్ ఎగిరి పోయిండు
- కవిత సహా అనేక మంది ఆయనను లీడర్ చేసిండ్రు
- జీవన్ రెడ్డి కూడా చేరికలను ఆహ్వానించడం లేదు
- దమ్ముంటే ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
- గతంలో మేము బాజాప్తా పార్టీని విలీనం చేయించాం
- జగిత్యాల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్


**జగిత్యాల, ప్రజానావ:** గాలికి కొట్టుకుపోయేది గడ్డిపోచలు మాత్రమే అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చురకలంటించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాలకు పట్టిన శని పోయిందని ఈ నియోజకవర్గ ప్రజలు ఉత్సాహంగా ఉన్నట్లు అనిపిస్తోందని అన్నారు. 'కొన్ని సందర్భాల్లో కష్టాలు వచ్చినప్పుడు మనషుల విలువ తెలుస్తది. గాలికి గడ్డపారలు కొట్టుకుపోవు. గట్టి నాయకులు కొట్టుకుపోరు. గాలికి కొట్టుకుపోయేది గడ్డిపోచలు మాత్రమే. గడ్డపారల్లాంటి మీరు వెళ్లలేదు. ఒక గడ్డిపోచ మాత్రమే కొట్టుకుపోయింది' అని ఎమ్మెల్యే సంజయ్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'కవితక్కతో సహా వేలమంది కష్టపడితే ఆయన ఎమ్మెల్యే అయిండు. ఇప్పుడు ఆ ఎమ్మెల్యే దొంగల్లో కలిసిండు. రేవంత్ రెడ్డి విసిరే ఎంగిలి మెతులకు ఆశపడి పోయిండు. ఎమ్మెల్యే బుద్ధి ఇవాళ తెలిసి వచ్చింది. అభివృద్ధి కోసం పోయినా అని

మిగతా 2 లో

## హైకోర్టులో కేసీఆర్‌కు చుక్కెదురు

విద్యుత్ విచారణ కమిషన్ రద్దు పిటిషన్ కొట్టివేత


2 లో..



## శివుడి నుంచి ప్రేరణ పొందా

- నోట్ల రద్దు, జీఎస్టీతో దేశం అతలాకుతలం
- నీట్ పరీక్షల్లో అవతవకలపై ఎందుకు చర్చించరు?
- బీజేపీని, ప్రధాని మోడీని టార్గెట్ చేస్తూ రాహుల్ విమర్శలు

7 లో..



## బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును కూల్చేయండి

- రూ. 100 కోట్ల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం
- అనుమతి లేకుండా నిర్మిస్తుంటే ఊరుకుంటారా..?
- నోటీసులు ఇచ్చి వెంటనే కూల్చివేయండి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశం
- మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచన



**నల్లగొండ, ప్రజానావ:** ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును కూల్చివేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నల్గొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి పదవీ ప్రమాణ స్వీకారంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. పేదలకు ఇండ్లు కట్టుకుంటే అధికారులు ఊరుకోరని, బీఆర్ఎస్ ఆఫీసు విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు.

మిగతా 2 లో

## కవిత బెయిల్ పిటిషన్ తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

సుప్రీంను ఆశ్రయించే యోచనలో లాయర్లు

2 లో..




## ఇంటి మిద్దె కూలి నలుగురు మృతి

- ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి కూలిన మిద్దె
- తల్లి ముగ్గురు చిన్నారులు మృతి, భర్తకు తీవ్రగాయాలు
- ఆదివారం కురిసిన వర్షాలు కూలిన పాత ఇల్లు
- నాగర్ కర్నూల్ వనపట్ల గ్రామంలో దుర్ఘటన

**నాగర్‌కర్నూల్, ప్రజానావ:** నాగర్ కర్నూల్ జిల్లాలో ఘోరం చోటుచేసుకుంది.. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఇంటి మట్టి మిద్దె కూలి ముగ్గురు చిన్నారులతో సహా తల్లి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ వనపట్ల గ్రామంలో జరిగింది.. అర్ధరాత్రి నిద్రిస్తున్న వారిపై భారీ మట్టిదిబ్బలు పడటంతో గొడుగు భాస్కర్.. భార్య గొడుగు పద్మ, పిల్లలు తేజస్విని(6), వసంత(6), రుత్విక్(4) అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. భాస్కర్‌కు తీవ్రగాయాలు కావడంతో జిల్లా అస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని అధికారులు తెలిపారు.

మిగతా 2 లో






## విద్యుత్ బిల్లుల చెల్లింపులో కష్టాలు

- క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు నిలిపివేత
- ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పేల ద్వారా కూడా చెల్లింపులకు నో

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి థర్డ్ పార్టీ యాప్స్‌ను ఉపయోగించి విద్యుత్ బిల్లులు చెల్లించడం ఇక కుదరదు. ఇలాంటి చెల్లింపులకు విద్యుత్ సంస్థ అనుమతిని నిరాకరించింది. వీటితో ఈ నెల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయడం సాధ్యపడదు. క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపుల తరహాలోనే ఆయా యాప్స్ ఈ సేవలనూ నిలిపివేసారు. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తమ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లోనే బిల్లుల చెల్లింపులు చేయాలని వినియోగదారులకు

మిగతా 2 లో



## ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కల నెరవేరుస్తాం

### బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయిస్తాం
### అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

**ఖైరతాబాద్, ప్రజానావ:** పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ పథకాన్ని భద్రాచలం రాములవారి సన్నిధిలో ప్రారంభించామని చెప్పారు.

మిగతా 2 లో

## పొత్తులను అపహాస్యం చేసి.. ఇప్పుడు అదే ఆధారం

- మోడీ పాలనలో అయోధ్య మొదలు అన్నీ లీకులే
- నీట్, నిట్, యూజీసీ పరీక్షలన్నీ లీకులే
- రాజ్యసభలో విమర్శలు గుప్పించిన ఖర్గే

7 లో..

# త్వరలో కేబినెట్ విస్తరణ?

(మొదటిపేజీ తరువాయి)

గత ఆరు మాసాలుగా ఎదురుచూస్తున్నారు. రేవంత్ రెడ్డి, ఆయన 11 మంది కేబినెట్ కొలీగులు 2023 డిసెంబర్ 7న ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్రానికి గరిష్ఠంగా 18 మంది మంత్రులు ఉండొచ్చు. ఇదిలా వుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న బిల్లుల గురించి గవర్నర్‌కు వివరించారని తెలుస్తోంది. ఈ సందర్భంగా నామినేటెడ్ ఎంఎల్‌సిల అంశం కూడా చర్చకు వచ్చిందని తెలుస్తోంది. గత మార్చిలో తెలంగాణ హైకోర్టు గవర్నర్ కోటా కింద నామినేట్ అయిన ఎం.కోదండ రామ్, అమీర్ అలీ ఖాన్ నామినేషన్లను కొట్టేసింది. గవర్నర్ ఉత్తర్వును 2023 సెప్టెంబర్ 19న హైకోర్టు కొట్టేసింది. బిఆర్ఎస్ నాయకులు శ్రవన్ దాసోజు, కె. సత్యనారాయణ నామినేషన్లను తిరస్కరించింది. ఆ తర్వాత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, గవర్నర్ కోటా కింద వారి నామినేషన్లను తిరస్కరించారు. గవర్నర్ ఉత్తర్వులను సవాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకులు హైకోర్టులో రిట్ పిటీషన్లను దాఖలు చేశారు.

గవర్నర్ ఎంఎల్ సిలను నియమించేలా వారు అప్పీలు చేసుకు న్నారు. ఈ క్రమంలో సిఎం భేటీలో ఈ అంశా లు కూడా చర్చించి ఉంటారని భావిస్తున్నారు. ప్రధానంగా కేబినేట్ భేటీ, అసెంబ్లీ సమావేశ లు, నామినేటెడ్ ఎమ్మెల్సీల అంశాలను చర్చించి ఉంటారని అనుకుంటున్నారు.



# హైకోర్టులో కేసీఆర్‌కు చుక్కెదురు

## విద్యుత్ విచారణ కమిషన్ రద్దు పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విద్యుత్ విచారణపై వేసిన కమిషన్ ను రద్దు చేయాటంలూ కేసీఆర్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ప్రభుత్వ వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. విద్యుత్ అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ విచారణపై కేసీఆర్ సవాల్ చేశారు. దీనిపై విచారించిన కోర్టు సోమవారం కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వెలువరించింది. విద్యుత్ కొనుగోలు అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ విచారణను కేసీఆర్ సవాల్ చేశారు. ఇరువైపుల వాదనలూ విన్న న్యాయస్థానం ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ కేసీఆర్ పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు రోజుల ముందే వాదనలు ముగిశాయి. అయితే ఆ రోజున హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అసలు కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్-తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ సంఘాన్ని నియమించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# కవిత బెయిల్ పిటిషన్ తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

## సుప్రీంను ఆశ్రయించే యోచనలో లాయర్లు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు చుక్కెదురైంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జ్యైలు శిక్ష అనుభవిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ ఆశలపై ఢిల్లీ హైకోర్టు నీళ్లు చల్లింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన ధర్మాసనం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. కవిత దాఖలు చేసిన రెండు బెయిల్ పిటిషన్లనూ కోర్టు తిరస్కరించింది. లిక్కర్ స్కాం విచారణలో భాగంగా కవితను ఇప్పటికే ఈడీ, సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారణ జరిపి తీర్పు వెలువరిం చారు. ఈడీ, సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకొని కవితకు బెయిల్ ఇవ్వడానికి న్యాయమూర్తి నిరాకరించారు. ఈ కేసులో ఆమెను మార్చి 15న ఈడీ, ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా కవిత ప్రస్తుతం తీహార్ జ్యైలులో ఉన్నారు. ఈడీ, సీబీఐ కేసులో అరెస్టై.. తీహార్ జ్యైల్లో ఉన్న కవిత ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన రెండు బెయిల్ పిటిషన్లపై విచారణ జరిగింది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఈ క్రమంలో కవిత సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయి తీహార్ జ్యైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు బెయిల్ నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కవిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కవిత దాఖలు చేసిన రెండు పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ, ఈడీ, సీబీఐ కేసుల్లో మే 6న కవిత బెయిల్ పిటిషన్లను ట్రయల్ కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఢిల్లీ లిక్కర్ పాలసీ ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొంటూ బెయిల్ నిరాకరించింది. మార్చి 16న లిక్కర్ పాలసీ ఈడీ కేసులో, ఏప్రిల్ 11న సీబీఐ కేసులో కవిత అరెస్టయిన సంగతి తెలిసిందే.కవిత ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జ్యైలులో ఉన్నారు. పీఎంఎల్‌ఏ సెక్షన్%-%19 ప్రకారం.. కవిత అరెస్ట్ చట్ట విరుద్ధమని, ఆమె రూ.100 కోట్లు చెల్లించినట్లు ఎక్కడా ఆధారాలు లేవని ఆమె తరపు న్యాయవాది కోర్టులో గట్టిగా వాదించారు. ఈ మేరకు ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ఈడీ, సీబీఐలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈడీ .. సీబీఐ వాదనలతో ఏకీభవించిన ఢిల్లీ హైకోర్టు కవిత బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది.

# త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఖాయం

## సీతక్కకు హోం మంత్రి పదవి వస్తుందన్న దామోదర

**హైదరాబాద్, ప్రజానావ:** సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని రావడంతో పాటు, గవర్నర్ రాధాకృష్ణన్‌కు కలిసి చర్చించడంతో మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు ఊంపదుకున్నాయి. ఇటీవలే హైకమాండ్ వద్ద మంత్రివర్గ విస్తరణపై చర్చించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో త్వరలోనే తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఉంటుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆయన సోమవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురి మంత్రుల శాఖలు సైతం మారే అవకాశాలున్నాయన్నారు. సీతక్కకు హోం మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందన్నారు. రాజగోపాల్‌రెడ్డి, దానం నాగేందర్, నిజామా బాద్ నుంచి ఒకరికి మంత్రివర్గంలో స్థానం లభించే అవకాశం ఉందన్నారు. రాజకీయాలు పరిస్థితులను బట్టి మారుతుంటాయన్నారు. 2018 ఎన్నిలకు ముందు ప్యారాషూట్లకు టికెట్లు లేవని రాహుల్ గాంధీ చెప్పారని.. కానీ పరిస్థితుల దృష్ట్యా టికెట్ల కేటాయింపు జరిగిందన్నారు. త్వరలో వైద్య శాఖలో ప్రక్షాళన, సంస్కరణలు తీసుకువస్తామన్నారు. వైద్యశాఖలో రెండే విభాగాలు ఉండాలన్నారు. ఇందులో ఒకటి అడ్మినిస్ట్రేషన్, రెండు ఎడ్యుకేషన్ అన్నారు.

# జగిత్యాలకు శని వదిలింది

(మొదటిపేజీ తరువాయి)

సంజయ్ అన్నాడు. జగిత్యాల జిల్లా రద్దు చేస్తా.. మెడికల్, నర్సింగ్ కాలేజీ రద్దు చేస్తా అని రేవంత్ రెడ్డి అన్నందుకు సంజయ్ కాంగ్రెస్‌లోకి వెళ్లిండా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 4500 డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చినందుకు రద్దు చేయమని పోయావా..? ఏ అభివృద్ధి ఆశించి పోయిండు సంజయ్. ఆయన పోయింది ఒక్కదాని కోసం.. ఇయ్యంకుడి బిల్లులు రావాలి.. ఆయన క్రషర్ ఆగొద్దని పోయిండు. సొంత అభివృద్ధి కోసం పోయిండు.. జగిత్యాల అభివృద్ధి కోసం పోలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిగ్గు లేకుండా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ ఆయారాం, గయారాం అనే విషబీజానికి శ్రీకారం చుట్టిందే ఇందిరాగాంధీ హయాంలోని కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. 2004లో మనతో పొత్తు పెట్టుకొని మన 26 మంది ఎమ్మెల్యేలలో 10 మంది ఎమ్మెల్యేలను కలుపుకునే పని చేసిందని అన్నారు. అయినా సరే 2014లో ఇదే కాంగ్రెస్‌తో కొట్లాడి కేసీఆర్ ఆధ్వర్యంలో మనం తెలంగాణ తెచ్చుకున్నామని అన్నారు. 2014లో ఇప్పుడున్న సీఎం రేవంత్ రెడ్డి మన ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేసింది వీరీరంతా చూశారు. తెలంగాణను నడిపియ్యలేక పోతున్నారని చెప్పేందుకు, ప్రభుత్వం స్థిరంగా లేదని సర్కార్ ను పడగొట్టే ప్రయత్నం చేశారు. ఆ పరిస్థితుల్లో రాజ్యాంగ బద్ధంగా మూడిరట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు మన పార్టీలో చేరారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే విధంగా మనం వ్యవహరించలేదు. అప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరినప్పుడు ఇదే రేవంత్ రెడ్డి వాళ్లను రాళ్లతో కొట్టి చంపాలన్నాడు. రేవంత్ రెడ్డి ఇప్పుడు చెప్పాలె? ఎవరిని రాళ్లతో కొట్టాలే? ఎవరు పిచ్చి కుక్క? ఇప్పుడు రేవంత్ రెడ్డిని కొట్టాలా? ఇక్కడి ఎమ్మెల్యే సంజయ్‌ను కొట్టాలా? రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే, నీవు మగాడివైతే నువ్వు తీసుకున్న ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలన్నారు. వాళ్లను మళ్లీ గెలిపించుకుంటే నువ్వు దమ్మునోడివి. ఒక్క రేవంత్ రెడ్డి మాత్రమే కాదు. రాహుల్ గాంధీ ఏమన్నాడో కూడా వినాలె. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీలో చేరితే ఆటోమేటిక్‌గా సభ్యత్వం రద్దు అయ్యేలా చేస్తామని హైదరాబాద్ లోనే చెప్పిండు. పాంచ్ న్యాయ్ పేరుతో ఇదే అంశాన్ని రాహుల్ గాంధీ మేనిఫెస్టోలో కూడా పెట్టిండు. కానీ ఇప్పుడు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేస్తుందేమిటీ ప్రజలు గుర్తించాలని అన్నారు. వాళ్ల పార్టీ నాయకుడు జీవన్ రెడ్డి కూడా ఇదే అంశంపై సొంత పార్టీ పై విమర్శలు చేశాడు. బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడాల్సిన, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలోకి వచ్చింది. మూడోసారి మూడో వంతు సీట్లలో గెలిచింది. 14 సీట్లలో కొద్ది తేడాతో మాత్రమే ఓడిపోయింది. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో ఏం జరిగిందో వీరికు తెలుసు? మోదీ కావాలా? వద్దా? అన్నట్లుగా ప్రచారం చేశారు. దీంతో ఐతే ఎన్డీయే, ఇండియా కూటమి లో లేని పార్టీలకు ఇబ్బంది జరిగింది. ఒక్క బీఆర్ఎస్ కు మాత్రమే కాదు. ఏ కూటమిలో లేని సీపీఎం, వైఎస్ఆర్ సీపీ, బీజేడీ, అన్నాడీఎంకే, బీఎస్పీ, అకాలీదల్ లకు కూడా ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ‘420 హామీలు ఇచ్చి రేవంత్ రెడ్డి గద్దెనెక్కిండు. వాటికి సంబంధించి ప్రజలు నిలదీస్తే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లోనే ముసలం పుడుతుందని రేవంత్ భయపడ్డాడు. అందుకే ఎమ్మెల్యేలను గొర్రెలు, బర్రెల మాదిరిగా డబ్బులు పడేసి కొని తన దొడ్లో కట్టేసుకుంటున్నాడు. ఇచ్చిన హామీలను డైవర్ట్ చేసేందుకు ఎమ్మెల్యేలను ఎత్తుకుపోతుండు. జగిత్యాల కార్యకర్తలను చూస్తే సంతోషంగా ఉంది. జగిత్యాలకు పట్టిన శని పోయిందన్నట్లుగా ధైర్యంగా కనిపిస్తున్నారు. కుండ పగిలితే పగిలింది. కానీ కుక్క బుద్ధి తెలిసిందన్నట్లుగా మీ ఎమ్మెల్యే బుద్ధి తెలిసింది’ అని కేటీఆర్ మాట్లాడారు.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కల నెరవేరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాది పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని ఇందుకు అనుగుణంగా వచ్చే బడ్జెట్లో నిధుల కేటాయింపులు కూడా జరుపుతున్నామని వెల్లడిరచారు. సచివాలయంలో హౌసింగ్ పై ఆయన సవిరీక్ష నిర్వహించారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు మంత్రి పొంగులేటి, మొదటి దశలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3 వేల500 ఇండ్ల చొప్పున 4 లక్షల16 వేల 500 ఇండ్లు, రిజర్వ్ కోట కింద 33 వేల 500 ఇండ్లు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు అవసరమైన 22 వేల 500 కోట్ల రూపాయలను బడ్జెట్లో కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రికి వెల్లడిరచామన్నారు. గడచిన పది సంవత్సరాలలో సొంత ఇంటి సాకారం అనేది పేదవారికి అందని ద్రాక్షలా మారిందని మంత్రి పొంగులేటి ఆవేదం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటికి కనిపిస్తున్నాయని అన్నారు. పేదలు ఆత్మగౌరంతో బతకాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి పనిచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

# ఇంటి మిద్దె కూలి నలుగురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పటిలాగే ఆదివారం రాత్రి భోజనం ముగించుకొని కుటుంబ సభ్యులు అందరూ నిద్రకు ఉపక్రమించారు. ముందు గదిలో గొడుగు భాస్కర్ తల్లిదండ్రులు పడుకోగా రెండవ గదిలో భాస్కర్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నిద్రించారు. అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో ఒక్కసారిగా మిద్దె కూలీ మట్టి దిబ్బలు, దూలాలు వారిపై పడిపోయాయి. మట్టి దిబ్బల కిందే ముగ్గురు పిల్లలతో సహా తల్లి తుదిశ్వాస విడిచారు. మొదట తండ్రి భాస్కర్ సైతం ప్రాణాలు కోల్పోయాడని భా వించారు. శరీరంలో కదలిక కనిపించడంతో స్థానికు లు ఆయనకు సీపీఆర్ నిర్వహించారు. అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా అస్పత్రికి తరలించారు. ప్రస్తుతం భాస్కర్ అక్కడే చికిత్స పొందుతున్నారు. దీంతో వనపట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ముగ్గురు చిన్నారులు, తల్లి మరణించడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కళ్లముందే ఆడుకుంటు తిరిగే చిన్నారులు విగతజీవులుగా పడి ఉండడాన్ని తట్టుకోలేక గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. భారీ వర్షానికి ఇంటి మిద్దె కూలినట్లు చెబుతున్నారు.జిల్లా అస్పత్రిలో నలుగురు బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి పరామర్శించారు. చికిత్స పొందుతున్న భాస్కర్ కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

# అమెరికాలో తెలంగాణ విద్యార్థి మృతి



**ఖమ్మం, ప్రజానావ:** అమెరికాలోని మిస్సౌరీలో హైదరాబాద్ కు చెందిన భారతీయ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతుండగా ప్రమాదవ శాత్తూ నీటమునిగి ప్రాణాలు కోల్పోయాడు. అతడిని రక్షించేందుకు స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వారికి కూడా ఈత రాకపోవ డంతో నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవాల్సి వచ్చింది. కిరణ్ కి కూడా ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. చికాగోలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది.కాగా, హైదరాబాద్ లో నివసిస్తున్న ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన కిరణ్, సెయింట్ లూయిస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు నవంబర్ 2023లో అమెరికా వెళ్లాడు. ఇటీవల తన ముగ్గురు స్నేహితులతో కలిసి మిస్సౌరీలోని శాండ్ హిల్ టౌన్ సమీపంలోని ఓ స్విమ్మింగ్ పూల్ లో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్ళాడు. ఆ పూల్ లోతు 8 అడుగులు ఉండటంతో ఈత కొట్టడం రాని కిరణ్ మునిగిపోయాడు. అతని స్నేహితులకు కూడా ఈత రాకపోవడంతో రక్షించేందుకు ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. స్నేహితుడు తమ కళ్ళముందే నీటమునిగిపోతున్నా ప్రాణాలు కాపాడలేకపోయామని వారు ఎమోషనల్ అయ్యారు. కిరణ్ మూడు రోజుల క్రితం సర్టిఫికేషన్ పూర్తి చేసినట్లు లింక్డ్ ఇన్ లో పోస్ట్ చేశాడు. అతని అకాల ఆయన కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అతని తండ్రి లక్ష్మణ్ రాజు గతంలో మరణించగా, తల్లి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కిరణ్ తాత కృష్ణమూర్తి రాజు కుటుంబ వ్యవహారాలను పర్యవేక్షిస్తూ కిరణ్ చదువుకు సహకరిస్తు న్నారు. కిరణ్ సెయింట్ లూయిస్‌లో కంప్యూటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో మాస్టర్స్ చదువుతున్నాడు. అతను ఉస్మానియా విశ్వవిద్యాల యం నుండి అండర్ గ్రాడ్యుయేట్ చదివాడు. చికాగోలోని భారత రాయబార కార్యాలయం ఈ సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కిరణ్ బంధువులతో సంప్రదింపు లు జరుపుతున్నామని, ఈ కష్ట సమయంలో అవసరమైన సహాయాన్ని అందజేస్తున్నామని పేర్కొంది. మృతదేహాన్ని హైదరా బాద్ పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది.

# విద్యుత్ బిల్లుల చెల్లింపులో కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

సూచించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి జులై 1 నుంచి ఆయా చెల్లింపు సంస్థలు విద్యుత్ బిల్లులు చెల్లింపులను నిలిపివేశాయని ఎక్స్ ద్వారా తెలిపింది. ఒక్క దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర డిస్కమ్‌లదీ అదే పరిస్థితి. ఈ క్రమంలో వీటి ద్వారా బిల్లులు చెల్లించాలని ప్రయత్నించినప్పుడు భారత్ బిల్లు పేమెంట్ సిస్టమ్‌కు రిజిస్టర్ కాలేదని చూపిస్తోంది. దీనివల్ల పెద్ద సంఖ్యలో వినియోగదారులపై ప్రభావం పడనుంది. దీంతో ఆయా విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలోని వినియోగదారులు డిస్కమ్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌ను ఆశ్రయించాల్సిందే. బిల్లు చెల్లింపుల్లో సమర్థత, భద్రతకు పెద్ద పీట వేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. బిల్లు చెల్లింపులన్నీ భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ ద్వారానే జరగాలని నిర్దేశించింది. జులై 1 నుంచి కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. దీనిలో భాగంగా భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌ను బిల్లర్లు ఎనేబుల్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రైవేటు బ్యాంకులకు సంబంధించి హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులు ఈ పేమెంట్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసుకోలేదు. దీంతో ఫోన్ పే, క్రెడ్ వంటి కంపెనీలు కస్టమర్ల క్రెడిట్ కార్డుల బిల్లులను ప్రాసెస్ చేయలేవు. దీనివల్ల ఆయా యాప్స్‌లో క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపు వీలు పడదు. ఇప్పుడు విద్యుత్ బిల్లుల చెల్లింపుల విషయంలోనూ అదే

# మరో ఎనిమిది మంది ఐపీఎస్‌ల బదిలీ

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణలో ఎనిమిది మంది ఐపిఎస్ అధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలో ఎనిమిది మంది ఐపీఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిని బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డిసిపిగా సుభాశ్ నియమితులయ్యారు. కొత్తగూడెం ఓఎస్టీగా పరితోష్ పంకజ్‌ను, ములుగు ఓఎస్టీగా మహేశ్ బాబా సాహెబ్ ను, గవర్నర్ ఓఎస్టీగా సిరిశెట్టి సంకీర్త్ నియమితులయ్యారు. భద్రాచలం ఏఎస్పీగా అంకిత్ కుమార్‌ను భైంసా ఏఎస్పీగా అవినాష్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. వేములవాడ ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డిని, ఏటూరునాగారం ఏఎస్పీగా శివమ్ ఉపాధ్యాయను నియమిస్తూ ఉత్వర్తులు జారీ అయ్యాయి.

# లోక్‌సభ నుంచి విపక్షం వాకౌట్

**న్యూఢిల్లీ :** పార్లమెంటు సమావేశాలు ఆరోరోజు సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమయ్యాయి. నీట్‌పై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై బిజెపి నేత అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభించడంతో ప్రతిపక్ష సభ్యులు సభ నుండి వాకౌట్ చేశారు. ప్రతిపక్ష నేతగా ఎంపికైన రాహుల్ గాంధీకి బిజెపి ఎంపి అభినందనలు తెలిపారు. ఇన్నాళ్లూ రాహుల్ గాంధీ బాధ్యత లేకుండా అధికారంలో కొనసాగారని, ఇప్పుడు ఆయనకు అధికారంతో పాటు బాధ్యత కూడా వహించాల్సి వుంటుందని అన్నారు. ఇప్పుడు మూడోసారి ప్రధాని అయిన మోడీకి పరీక్ష కాదని, ప్రతిపక్షాలకు పరీక్ష అని అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. పార్లమెంటును ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో దార్శనికత, దిశానిర్దేశర లేదని అన్నారు. పేదలు, దళితులు, మైనారిటీల గురించి ప్రస్తావించలేదని చెప్పారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి
# సీఎం చంద్రబాబు లేఖ

- విభజన హామీలు, సమస్యలపై చర్చిద్దాం అంటూ ఆహ్వానం
- ఈ నెల 6న ముఖాముఖి కలిసి చర్చించుకుందామని ప్రతిపాదన

**అమరావతి, ప్రజానావ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన విభజన హామీలను లేఖలో ప్రస్తావించారు చంద్రబాబు. ఈ నెల 6న ముఖాముఖి కలిసి చర్చించుకుందామని చంద్రబాబు ప్రతిపాదించారు. ఉమ్మడి ఏపీ విభజన జరిగి పదేళ్లు దాటినా, కొన్ని అంశాలు పరిష్కారం కాలేదని చంద్రబాబు లేఖలో గుర్తు చేశారు. విభజన హామీల పరిష్కారానికి కలిసి చర్చించుకుందామని చంద్రబాబు కోరారు. పరస్పర సహకారం తెలుగు ప్రజల అభ్యున్నతికి తోడ్పడుతుందని చంద్రబాబు చెప్పారు. "సీఎంగా రేవంత్ రెడ్డి అంకితభావం, నాయకత్వం తెలంగాణ ప్రగతికి, అభివృద్ధికి గణనీయంగా తోడ్పడ్డాయి. తెలుగు మాట్లాడే రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండింటికీ సుస్థిరమైన పురోగతి, శ్రేయస్సు అవసరం. దీని కోసం రెండు రాష్ట్రాలు సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయ్యాయి. పునర్ వ్యవస్థీకరణ చట్టం నుండి ఉత్పన్నమయ్యే సమస్యల గురించి అనేక చర్చలు జరిగాయి. ఈ సమస్యలను చాలా శ్రద్ధతో, పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో జూలై 6వ తేదీ శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ లో కలుసుకోవాలని నేను ప్రతిపాదిస్తున్నాను. ముఖాముఖి సమావేశం ఈ క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుంది. మన మధ్య జరిగే ఈ చర్చలు ఫలవంతం అవుతాయని రెండు రాష్ట్రాలకు ఉపయోగపడతాయని భావిస్తున్నా" అని లేఖలో పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోవడానికి చొరవ చూపించాలని లేఖలో పేర్కొన్నారు చంద్రబాబు. పరస్పర సహకారం తెలుగు ప్రజల అభ్యున్నతికి తోడ్పడుతుందని కూడా చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఏపీ విభజన జరిగి పదేళ్ల దాటినా కొన్ని సమస్యలు పరిష్కారం కాలేదని లేఖలో పేర్కొన్నారు చంద్రబాబు. ఈ నెల 6న ముఖాముఖి సమావేశమై సమస్యలు పరిష్కరించుకుందామని రేవంత్ రెడ్డికి పిలుపునిచ్చారు చంద్రబాబు. అంతేకాదు.. రేవంత్ రెడ్డిని పొగిడారు సీఎం చంద్రబాబు. ముఖాముఖి సమావేశం క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మన మధ్య జరిగే ఈ చర్చలు ఫలవంతం అవుతాయని, రెండు రాష్ట్రాలకు ఉపయోగపడతాయని భావిస్తున్నానని లేఖలో ఆకాంక్షించారు చంద్రబాబు. మొత్తంగా ఒక చొరవ అయితే చంద్రబాబు తీసుకున్నారు. ఏపీ సీఎంగా తెలంగాణ సీఎంకు ఆయన కీలక ప్రతిపాదన చేశారు. తెలంగాణ సీఎంని చర్చలకు ఆహ్వానించారు.



## తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు చేదు అనుభవం

**అర్వపల్లి, ప్రజానావ:** తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ కు చేదు అనుభవం ఎదురైంది. అర్వపల్లి వద్ద సొంత పార్టీ నేతల నుంచే తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ కు నిరసన సెగ ఎదురైంది. తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. ఇందులో భాగంగానే తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ వాహనాన్ని అడ్డుకోబోయారు ఆందోళన కారులు. ఎమ్మెల్యే సామెల్ తమకు సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారంటూ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సీఎం రేవంత్ రెడ్డి జిందాబాద్ అంటూనే.. తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. కాగా మందుల సామేల్ మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచిన సంగతి తెలిసందే. జాజిరెడ్డిగూడెం కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మందుల సామేలుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

## ఆ పిటిషన్‌ను కొట్టివేయడం కేసీఆర్‌కు చెంప పెట్టులాంటింది

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్, ప్రజానావ:** జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ రద్దు కోసం హైకోర్టుకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చుక్కెదురైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేయడం కేసీఆర్‌కు చెంప పెట్టులాంటిందని అన్నారు.కేసీఆర్ వాస్తవాలను దాచి పెట్టాలనుకునే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. చట్టం ముందు అందరూ సమానమే అని అన్నారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు చేసిన కమిషన్‌ను రద్దు చేయాలనే సాహసం చేస్తున్నాడని ఫైర్ అయ్యారు.కేసీఆర్ కు జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందు హాజరై వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత ఉన్నదని అన్నారు. 10 సంవత్సరాలలో తుగ్లక్ నిర్ణయాలు తీసుకోవడం వలనే రాష్ట్రం అప్పుల పాలైందని విమర్శించారు. కమిషన్ విచారణలో తప్పుతేలితే, కేసీఆర్ శిక్ష అనుభవించాల్సిందేనని అన్నార. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి విసిరిన సవాల్ పైనే ప్రభుత్వం విచారణ జరుపుతోందని తెలిపారు. ఏ విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరి పారిపోతారా..? అంటూ మండిపడ్డారు



# తెలంగాణను వణికిస్తున్న సీజనల్ జ్వరాలు

**హైదరాబాద్, ప్రజానావ:** వర్షాకాలం రాకతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి.పలు రకాల జ్వరాలతో రోగులు హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆసుపత్రులకు తరలివస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇప్పటికే తెలంగాణలో 882 డెంగీ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంలోనే 60కి పైగా డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యులు చెప్పారు. నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రిలోనే 29 డెంగీ ఫీవర్ కేసులు వచ్చాయి. డెంగీ ప్రబలుతుండటంతో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది.హైదరాబాద్ నగరంలోని ఆసుపత్రులు, పీహెచ్ సీలు, బస్తీ దవాఖానాల్లో డెంగీ పరీక్షల కోసం ర్యాపిడ్ కిట్లు, మందులను సిద్ధంగా ఉంచారు. నగరంలో దోమలను నివారించేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం చర్యలు చేపట్టింది.నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా ఫాగింగ్ చేస్తున్నామని జీహెచ్ఎంసీ కార్పొరేటర్ పన్యాల దేవేందర్ రెడ్డి చెప్పారు. ఒక డెంగీ కేసు నమోదైతే రోగి ఉన్న ఇంటి చుట్టూ 50 ఇళ్ల ప్రాంతాల్లో యాంటీ లార్వా, ఫాగింగ్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నీళ్ల ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు పెట్టుకోవాలని, కూలర్లు, టైర్లు, పూలకుండీల్లో నీరు నిల్వ ఉంచుకోరాదని దేవేందర్ రెడ్డి సూచించారు.

### ప్రబలుతున్న సీజనల్ జ్వరాలు

తెలంగాణలో ఈ సీజన్‌లో డెంగీ,మలేరియా,టైఫాయిడ్ వంటి జ్వరాల కేసులు అక్కడక్కడా నమోదవుతున్నాయి. చికున్ గున్యా వంటి వైరల్ జ్వరాలతో రోగులు ఆసుపత్రుల్లో క్యూ కడుతున్నారు.వర్షాల వల్ల తాగే నీరు కలుషితమైతే డయేరియా వ్యాపించే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయి. నీరు కలుషితమై డయేరియా కూడా కొన్ని ప్రాంతాల్లో ప్రబలుతోంది.

### డెంగీ జ్వరాల జోరు

తెలంగాణలో రోగులు డెంగీ జ్వరాల జోరు వల్ల రోగులు కలవరపడుతున్నారు. డెంగీ జ్వరం ఏడిస్ ఈజిప్టై అనే దోమకాటు వల్ల సోకుతోంది.ఈ దోమ కుట్టడం ద్వారా వ్యాపించే ఒక వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో దోమలు తేమతో కూడిన వాతావరణంలో వృద్ధి చెందుతున్నాయి. అధిక జ్వరం, తలనొప్పి, అలసట, కండరాలు, కీళ్ల నొప్పులు డెంగీ లక్షణాలు.జ్వరం వచ్చిన ఐదు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు కనిపించడం డెంగీ సూచిక.సాధారణంగా డెంగీ జ్వరం సమయంలో ప్లేట్‌లెట్ కణాల సంఖ్య చాలా వేగంగా తగ్గుతాయి.

### ఇతర రాష్ట్రాల్లోనూ ప్రబలుతున్న డెంగీ

రుతుపవనాల ఆగమనంతో కురుస్తున్న వర్షాల వల్ల తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిశా, మహారాష్ట్రతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో డెంగీ కేసులు పెరిగాయి. డెంగీ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. పలు రాష్ట్రాల్లో డెంగీ జ్వరాల వల్ల జనం మృత్యువాత పడుతున్నారు. కర్ణాటకలో డెంగీ కారణంగా 5,374 కేసులు నమోదు కాగా ఐదుగురు మరణించారు. తెలంగాణలో 882 కేసులు నమోదయ్యాయి.ఒడిషాలో 288, కేరళలో 400 డెంగీ జ్వరాల కేసులు నమోదయ్యాయి.

### దోమల నివారణకు చర్యలు

వర్షాలు కురుస్తుండటంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.దోమల నివారణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితోపాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.దోమల నివారణ మందులను ఉపయోగించడం, రక్షణ దుస్తులు ధరించడం వంటి రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు ప్రజలకు సూచించారు.

## మహిళలను టార్గెట్ చేసిన సైకో కిల్లర్..

- ఐదుగురిని హతమర్చిన కిరాతకుడు
- మహిళా అడ్డ కూలీలే టార్గెట్
- డబ్బు ఆశ చూపి అత్యాచారం, ఆపై హత్య
- ఒక కేసు దర్యాప్తులో బయటపడ్డ వరుస మర్డర్స్
- మహబూబ్‌నగర్ జిల్లాలో కలకలం రేపుతోన్న కిల్లర్



**మహబూబ్‌నగర్, ప్రజానావ:** పాలమూరు జిల్లాలో సీరియల్ కిల్లర్ కలకలం రేగింది. గత నెల జరిగిన ఓ మహిళ హత్య కేసు దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు ఖంగుతినేలా డొంక దొరికింది. రెండేళ్లుగా సాగిస్తున్న వరుస హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. మద్యం, ఇతర అలవాట్లకు బానిసైన ఓ కూలీ.. అత్యాచారం, హత్యలే టార్గెట్‌గా నేరాలు చేస్తున్నాడు. మొత్తం ఆరు హత్య కేసుల్లో నిందితుడిగా తేలి కటకటాల పాలయ్యాడు. కూలీ అడ్డాలోని ఆడవాళ్లే ఆ దుర్మార్గుడి లక్ష్యం. డబ్బు ఆశ చూపి మహిళలతో శారీరక సంబంధాలు పెట్టుకోవడం.. అనంతరం హత్య చేయడం అతనికి పరిపాటిగా మారింది. ఇటీవలే హత్యకు గురైన ఓ మహిళా కేసు కూపీ లాగితే మిగిలిన ఐదు మర్డర్ల కహానీ బయటపడింది. కుటుంబాన్ని వదిలి, మద్యానికి బానిసై మహిళల మాన, ప్రాణాలు తీస్తున్నాడు కీచకుడు. గత నెల 23న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అమిస్తాపూర్‌లో దాసరి లక్ష్మి అనే మహిళ దారుణ హత్యకు గురైంది. అత్యాచారం చేసిన అనంతరం లక్ష్మి గొంతుకోసి, మొఖంపై బండరాయితో మోదీ దారుణంగా చంపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న భూత్పూర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలిలో దొరికిన ఆధారాలతో పాటుగా ఆ పరిసర ప్రాంతాల సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. ఎట్టకేలకు నిందితుడు బోయ కాశమయ్యగా గుర్తించిన పోలీసులు అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా కేటిదొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన బోయకాశమయ్య అలియాస్ బోయ కాశీ రెండేళ్ల క్రితం ఇల్లు వదిలి మహబూబ్ నగర్‌లో ఉంటున్నాడు. స్థానికంగా కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మద్యం, ఇతర అలవాట్లకు బానిసై మహిళలపై నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. కూలీగా ఉన్న మహిళలే టార్గెట్‌గా హత్యలకు పాల్పడ్డాడు నిందితుడు. డబ్బు ఆశ చూపి ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా ఐదుగురు మహిళల హత్య కేసుల్లో నిందితుడిగా తేలాడు. తానొక్కడే ఐదుగురు మహిళల హత్యలకు పాల్పడ్డట్టూ నిందితుడు కాశమయ్య పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. భూత్పూరు పీఎస్ పరిధిలో గత నెలలో జరిగిన లక్ష్మి హత్యతో పాటు గతేడాది జూలైలో జరిగిన మున్నూరు మల్లేశ్ హత్యను తానే చేసినట్లు ఒప్పుకున్నాడు. అలాగే 2022లో హన్వాడ పీఎస్ పరిధిలో సీతమ్మ, 2023లో వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ, నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి పీఎస్ పరిధిలో మరో మహిళను చంపినట్లు కాశమయ్య అంగీకరించాడు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరిలో మహబూబ్‌నగర్ రూరల్ పీఎస్ పరిధిలో మరో మహిళను సైతం హత్య చేసినట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు



## పార్టీ మార్పుపై సబితా ఇంద్రారెడ్డి క్లారిటీ

**రంగారెడ్డి, ప్రజానావ:** తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల అంశం హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. మరో 10 నుండి 15 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరే అవకాశం ఉందంటూ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఫిరాయింపులను కట్టడి చేసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరుస సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యేలకు హితబోధలు చేశారు. వచ్చేది మన ప్రభుత్వమే, మీ అందరికి అండగా ఉంటాను, ప్రలోభాలకు లొంగకండి అంటూ భరోసా కల్పించారు. ఈ క్రమంలోనే.. మాజీ మంత్రి, మహేశ్వర బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పార్టీ మారబోతున్నారంటూ పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. వివిధ మాధ్యమాలలో న్యూస్ వైరల్ అయ్యాయి. దీంతో ఈ ప్రచారానికి చెక్ పెట్టేందుకు సబితా ఇంద్రారెడ్డి నేరుగా రంగంలోకి దిగారు. తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె ఒక పోస్ట్ పెట్టారు."నేను పార్టీ మారబోతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవం, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. తప్పుడు ప్రచారం చేయవద్దని ప్రసారమాధ్యమాలకి విజ్ఞప్తి. బీఆర్ఎస్ పార్టీలో నాకు గౌరవ కేసీఆర్ సముచితమైన స్థానం కల్పించారు, పార్టీ మరాల్సిన అవసరం కాని ఆలోచన కాని ఏమాత్రం లేదు. బీఆర్ఎస్ పార్టీలోనే కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తా" అంటూ సబితా ఇంద్రారెడ్డి తేల్చి చెప్పారు. దీంతో ఆమె పార్టీ మారబోతున్నారంటూ వస్తున్న వార్తలకు చెక్ పెట్టినట్లైంది.

## కొత్త చట్టాలు.. చార్మినార్ పరిధిలో తొలి కేసు నమోదు !

**చార్మినార్, ప్రజానావ:** దేశంలో నూతన చట్టాల కింద కేసుల నమోదు అవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మొదటి కేస్ అయింది. అది కూడా చార్మినార్ పీఎస్ లో కేసు నమోదు అయింది. నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వ్యక్తి పై కేస్ నమోదు చేశారు చార్మినార్ పోలీసులు. కొత్త చట్టాల ప్రకారం ఎఫ్ ఐ ఆర్ ను డిజిటల్ గా నమోదు చేశారు పోలీసులు. గంట లో వివిధ పోలీస్ స్టేషన్ లలో 3 ఎఫ్ ఐ ఆర్ లు నమోదు అయ్యాయి.అటు న్యూదిల్లీ రైల్వే స్టేషన్ పరిధిలోని ఓ వీధి వ్యాపారిపై కొత్త క్రిమినల్ కోడ్‌లోని సెక్షన్ 285 కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎన్‌డీఆర్ఎస్ సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ కింద రోడ్డుపై వాటర్ బాటిళ్లు, గుట్కా, బీడీ, సిగరెట్లు అమ్మడాన్ని గుర్తించిన పెట్రోలింగ్ పోలీసులు దానివల్ల రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఆ వ్యాపారిని తన బండిని వేరే చోటుకు తరలించమని గతంలో పలుమార్లు చెప్పారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో అతడి వ్యాపారం వల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను వీడియో తీసి, కేసు నమోదు చేసినట్లు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ వీధి వ్యాపారిని బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

## సీఎం రేవంత్ రెడ్డి అందుకే ఢిల్లీలో పర్యటించారు

### బీజేఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ ప్రభుత్వంపై బీజేఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో చేసింది ఏంటని నిలదీశారు. హైదరాబాద్‌లో వేల కోట్ల రూపాయల విలువైన భూములను తాకట్టు పెట్టేందుకు పైరవీలు చేశారని ఆరోపించారు. ఓ ఏజెన్సీ ద్వారా బ్యాంకులో రుణాలు తీసుకునేందుకు ప్రయత్నలు చేస్తున్నారని చెప్పారు. ఓ కార్పొరేషన్ పెట్టి, దాని ద్వారా భూములు తాకట్టు పెట్టి, మళ్లీ భూములను అమ్మి డబ్బులు కడుతామని చెబుతున్నారని అన్నారు. గతంలో కోకాపేట భూములు అమ్మకానికి పెట్టారని ధర్నాలు చేశారని, మరి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనేంటని ప్రశ్నించారు. ఎఫ్ఆర్బీఎం పరిధి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో రెండు భయంకర కొత్త చట్టాలు రాబోతున్నాయని అన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. రేవంత్ రెడ్డికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి గుట్టు చప్పుడు కాకుండా భూములు తాకట్టు పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ముందే అప్పులు చేసి ఖర్చులు చేస్తే మరి జీతాలు, పెన్షన్లు ఎలా చెల్లిస్తారని నిలదీశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇలా ఉందని తెలిసికూడా ఎందుకు హామీలు ఇచ్చారని ప్రశ్నించారు.

## పోలీస్ వాహనం ధ్వంసం చేసిన బల్మూరి వెంకట్ అనుచరులు

**ఖైరతాబాద్, ప్రజానావ:** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అనుచరులు దౌర్జన్యానికి దిగారు. పోలీస్ వాహనం ధ్వంసం చేశారు బల్మూరి వెంక ట్ అనుచరులు. వామపక్ష విద్యార్థి సంఘాల రాజభవన్ ముట్టడిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజ్ భవన్లో గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి సమావేశం జరుగుతుండగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో రాజ్ భవన్ కు వచ్చారు ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకులు. ఈ సంద ర్భంగా వారిని అరెస్టు చేస్తుండగా పోలీసుల వా హనం అద్దాలు ధ్వంసం చేశారు ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకులు. ఇక అటు ఎమ్మెల్యే పల్లా, రాకేష్ రెడ్డిలు అరెస్ట అయ్యారు. గాంధీ హాస్పిటల్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.



# విద్యార్థినులకు షూ అందజేత

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**ఖైరతాబాద్, ప్రజానావ:** గతంలో తాను ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ లోని రౌండ్ టేబుల్ పాఠశాల విద్యార్థినులకు షూ అందజేసి మాట నిలబెట్టుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు కార్యకర్తలతో ఒక్కో విద్యార్థినికి షూలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు జీవన్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, డివిజన్ కార్యకర్తలు నగేశ్, సాగర్, అబ్దుల్, గని, ఆకుల రాజు, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, బోయ సాయిలు, నాగార్జున, సంపంగి కిరణ్, బసవరాజు రవి, నాయక్, చందు, ఆంధ్ర శీను, వీరేష్, శ్రీశైలంతో పాటు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్న పిల్లలతో వెట్టి చేయిస్తే క్రిమినల్ కేసు

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**సిరిసిల్ల, ప్రజానావ:** చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 1 నుంచి 31వరకు జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో పోలీస్ అధికారులతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముస్కాన్-ఎక్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. 0-18ఏళ్లలోపు తప్పిపోయిన, వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాపులు, మెకానిక్ షాపులు, హోటళ్లతో పాటు భిక్షాటన చేస్తే వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగిస్తామన్నారు. ఎవరూ లేకపోతే స్టేట్ హోంకు పంపించడం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా భిక్షాటన, వెట్టి చాకిరీ చేయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు నమోదు చేస్తామన్నారు. బాలల హక్కుల సంరక్షణ ద్వారానే సంపూర్ణ మానవ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకొని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే 1098, డయల్ 100కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవో బాధ్యతల స్వీకరణ



**వేములవాడ, ప్రజానావ:** రాజన్న ఆలయ ఈఓగా బదిలీపై వచ్చిన డిప్యూటీ కమిషనర్ కే. వినోద్ రెడ్డి సోమవారం రాజన్న దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ మండపంలో ఆలయ అర్చకులచే వేదోక్త ఆశీర్వచనం పొందిన తర్వాత ఈఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆయన వెంట ఈఈ రాజేష్, డీఈలు రఘునందన్, ఏఈఓలు హరికిషన్, ప్రతాప నవీన్, బ్రాహ్మణగారి శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు తిరుపతి రావు, నటరాజ్, నాగుల మహేశ్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఈవో సీసీ ఎడ్ల శివసాయి, ఆలయ అధికారులు ఉన్నారు.

# వైద్య వృత్తి ఎంతో విశిష్టమైనది

## రాజన్న సిరిసిల్ల డీఎంహెచ్ఓ సుమన్ మోహన్ రావు




**సిరిసిల్ల, ప్రజానావ:** రోగులకు సేవ చేసే గుణం ఒక్క వైద్యులకు మాత్రమే ఉంటుందని, అందుకే వైద్య వృత్తి ఎంతో విశిష్టమైనదని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. సుమన్ మోహన్ రావు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యులు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా, ప్రపంచంలోనే అత్యంత గొప్ప వైద్యులు, బెంగాల్ రెండో ముఖ్యమంత్రిగా పనిచేసిన డా. బీదన్ చంద్రరాయ్ జ్ఞాపకార్థం, ఆయన అందించిన సేవలకు గుర్తుగా తన జయంతి, వర్ధంతి సందర్భంగా జులై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. సేవ అందించే గుణం ఒక్క వైద్యులకే ఉంటుందని, ప్రైవేటు వైద్యులు జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు డా. రమేశ్, డా.జైల్ సింగ్, డా. మురళీకృష్ణ, డా. సురసుర రాధాకృష్ణ, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడ్డ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

**తంగళ్లపల్లి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావును సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ సుధీర్ బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాంబశివరావుపై ఇటీవల వచ్చిన అవినీతి ఆరోపణలపై ఎస్పీ అఖిల్ మహాజన్ దర్యాప్తు చేసి నివేదికను ఐజీకి పంపారు. ఈ నివేదిక ఆధారంగా హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలు నిజం కావడంతో ఐజీ సస్పెన్షన్ వేటు వేస్తూ చర్యలు తీసుకున్నారు.



# రాజన్న ఆలయం వద్ద వ్యక్తి ఆత్మహత్య

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, భక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ గోపాల్ రెడ్డి సిబ్బందితో వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

# లయన్స్ క్లబ్ అఫ్ సిరిసిల్ల 52వ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

## అధ్యక్ష, కార్యదర్శులుగా భానుచందర్, శ్యాంసుందర్ రెడ్డి



**సిరిసిల్ల, ప్రజానావ:** లయన్స్ క్లబ్ అఫ్ సిరిసిల్ల 52వ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గా బచ్చు భానుచందర్, సెక్రటరీగా డా. దోర్నాల శ్యామ్ సుందర్ రెడ్డి, కోశాధికారిగా డా. పబ్బు యాదగిరి గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్టాలేషన్ అధికారిగా పీడీజీ అనంతుల శివప్రసాద్, గెస్ట్ అఫ్ హానర్‌గా పీడీ జీ నాగుల సంతోష్ గౌడ్, రీజియన్ చైర్ పర్సన్ పోతని ప్రవీణ్, జోనల్ చైర్‌పర్సన్ మడపు నవీన్ రెడ్డి, ప్రోగ్రాం చైర్ పర్సన్‌గా గుగ్గిళ్ల జగన్ గౌడ్, సభ్యులు హాజరయ్యారు.

# ఉపాధ్యాయుల కొరత తీర్చండి

## డీఈఓకు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వినతి



**ఖైరతాబాద్, ప్రజానావ:** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్‌లో ఉన్న గవర్నమెంట్ రౌండ్ టేబుల్ స్కూల్‌లోని ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ హైదరాబాద్ డీఈఓ రోహిణికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 30మంది ఉపాధ్యాయులకు బదులు కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారని, దీంతో బోధన విషయంలో అటు ఉపాధ్యాయులు.. ఇటు విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. అలాగే బీజేఆర్ నగర్‌లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సైతం పునర్నిర్మించాలని డీఈఓను కోరినట్లు చెప్పారు. ఈ విషయమై ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.



# వేములవాడ డీఎస్పీ బదిలీ

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ డీఎస్పీ కె.నాగేంద్ర చారి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వేములవాడ నూతన ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

## బీఆర్ఎస్వీ పాలమూరు వర్శిటీ కన్వీనర్ భరత్‌బాబు



**మహబూబ్‌నగర్, ప్రజానావ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్వీ పాలమూరు వర్శిటీ కన్వీనర్ భరత్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం భరత్‌బాబు ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్శిటీ మెయిన్ గేట్ వద్ద బీఆర్ఎస్వీ విద్యార్థి నేతలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలకు సంబంధించి స్పష్టమైన హామీలను ఇచ్చి, వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పి.. ఏడు నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. అధికార పార్టీ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. అధికారంలోకి రాగానే లక్ష ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ వేస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క నోటిఫికేషన్ వేయలేదన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 ప్రకారం ఎంపిక చేయాలని, గ్రూప్ - 2లో 2వేలు, గ్రూప్-3లో 3వేల పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి 12వేల పోస్టులను బిచ్చం వేసినట్టు వేశారని విమర్శించారు. వెంటనే 24 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆనాడు ఓట్ల కోసం అశోక్ నగర్ దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతలు బల్మూర్ వెంకట్, రియాజ్ వంటి నాయకులు నిరుద్యోగులకు కల్లబొల్లి మాటలు చెప్పి, నేడు ఉద్యోగ నియామకాల ఊసే ఎత్తడం లేదని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్శిటీ జేఏసీ విద్యార్థి నాయకుడు మోతీలాల్ గత ఎనిమిది రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగ హామీలను అమలు చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీ ఆసుపత్రికి వెళ్లి మోతీలాల్ చేత ఆమరణ నిరాహార దీక్ష విరమింపజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా భరత్‌బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రమేశ్, ఆంజనేయులు, రాఘవేంద్ర, నవీన్ గౌడ్, సాయి కుమార్, ప్రవీణ్, శ్రీకాంత్, మౌనిక, మమత, నిరుద్యోగ అభ్యర్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ హుండీ లెక్కింపు వాయిదా

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ రాజన్న ఆలయ హుండీ లెక్కింపు వాయిదా పడింది. మంగళవారం హుండీ లెక్కింపు జరగాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి హుండీ లెక్కింపు తేదీని త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు.



# జీతం వదిలేస్తున్నా..

- పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన
- తాను జీతం తీసుకోనని ప్రకటన
- తానే సొంతంగా ఫర్నీచర్ తెచ్చుకుంటానన్న పవన్
- ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటాం

**పిఠాపురం, ప్రజానావ:** పిఠాపురాన్ని దేశంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనేది తన ఆకాంక్ష అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. డబ్బులు సంపాదించాలనో.. కొత్తగా పేరు రావాలనో తనకు లేదన్నారు. గెలిచినందుకు ఆనందం లేదని.. పనిచేసి ప్రశంసలు అందుకుంటేనే ఆనందంగా ఉంటుందన్నారు. ప్రతి రెండు వారాలకోసారి పిఠాపురం వస్తానన్నారు పవన్ కళ్యాణ్. నియోజకవర్గంలోని సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరించడంపై ఫోకస్ పెడతానన్నారు. గోదావరి జిల్లాల్లో 80 శాతం చెరువులున్నా తాగడానికి నీళ్లు లేవని.. జల్ జీవన్ మిషన్‌కు కేంద్రం నిధులు ఇస్తుందని.. కానీ గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదన్నారు. విజయ వాడలోని తన క్యాంపు ఆఫీస్‌లో మరమ్మతుల గురించి తనను అధికారులు అడిగారని.. తాను ఏమీ చేయొద్దని చెప్పానన్నారు. అంతేకాదు క్యాంప్ ఆఫీస్‌లోకి తానే కొత్త ఫర్నీచర్ తెచ్చుకుంటానని పవన్ చెప్పారు. సచివాలయం సిబ్బంది వచ్చి వేతనాలకు సంబంధించిన పత్రాలపై సంతకాలు పెట్టమని తనను అడిగారని.. కానీ తనకు మనస్కరించలేదన్నారు. తాను జీతం తీసుకుని పనిచేద్దామనుకున్నానని.. కానీ తాను బాధ్యతలు తీసుకున్న పంచాయతీరాజ్ శాఖలో నిధుల్లేవన్నారు. తాను బాధ్యతలు నిర్వ ర్తిస్తున్న శాఖ అప్పుల్లో ఉన్నప్పుడు తాను జీతం తీసుకోవడం చాలా తప్పు అనిపించిందని.. అం దుకే జీతం వదిలేస్తున్నట్లు వారితో చెప్పా నన్నారు. అంతేకాదు ఎన్ని వేలకోట్ల రూపాయల అప్పులు ఉన్నాయో తెలియడం లేదని.. ఒక్కో శాకలో తవ్వే కొద్దీ లోపలికి వెళ్తానే ఉందన్నారు డిప్యూటీ సీఎం పవన్. వీటిని సరిచేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజల్లో తనకు సుస్థిర స్థానం కావాలని.. అన్ని పనులూ చిటికె లో కావని గమనించాలని.. కానీ అయ్యేలా పని చేస్తామన్నారు పవన్ కళ్యాణ్. తక్కువ చెప్పి ఎక్కువ పనిచేయాలనుకుంటున్నానని.. తనవైపు నుంచి ఎలాంటి అవినీతి జరగదన్నారు. పార్టీకి ఓటు వేయకపోయినా అర్హత ఉంటే పింఛన్లు కచ్చితంగా వస్తాయని.. అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్లు పెంచి ఇచ్చామే తప్ప తగ్గిం చలేదన్నారు. తాము అద్భుతాలు చేస్తామని చెప్ప ట్లేదని.. ప్రభుత్వం జవాబుదారీగా ఉంటుం దన్నారు. రాష్ట్రానికి సంక్షేమంతో పాటు అభివృ ద్ధి కావాలని అభిప్రాయపడ్డారు. తాము ప్రజల కు జవాబుదారీతనంగా ఉంటామన్నారు పవన్. తన మంత్రిత్వ శాఖలపై అధ్యయనం చేస్తున్నానని.. బాధ్యతలు చేపట్టిన వెంటనే నేరుగా పనిలోకి వెళ్లాలనుకున్నానన్నారు. పంచాయతీరాజ్ శాఖ నిధులను గత ప్రభుత్వం అడ్డగోలుగా మళ్లించిందన్నారు. రుషికొండలో విలాసవంతమైన భవనం అవసరమా? అని ప్రశ్నించిన పవన్.. రుషికొండలో కట్టిన డబ్బుతో ఎంతో అభివృద్ధి చేయొచ్చన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. కరోనా సమయంలో డాక్టర్ల సేవలు మరువలేనివి.. కరోనా బారినపడి 1,600 మంది వైద్యులు మరణించా రన్నారు. దురదృష్టవశాత్తు వైద్యులపై ఈమధ్య దాడులు పెరిగాయని.. రోగుల పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. వైద్యుల పట్ల రోగులు విశ్వాసం కలిగి ఉండాలని అన్నారు.

# అమర జవాన్లకు పరిహారం ఇవ్వాలి


- చంద్రబాబు ప్రభుత్వానికి జగన్ విజ్ఞప్తి
- లడఖ్‌లో వరదలతో నదిలో కొట్టుకుపోయిన యుద్ధ ట్యాంకు
- శిక్షణ పొందుతున్న ఐదుగురు జవాన్ల మరణం
- మృతుల్లో ముగ్గురు ఏపీకి చెందిన జవాన్లు



**తాడేపల్లి, ప్రజానావ:** లడఖ్ లో శిక్షణలో భాగంగా ఓ యుద్ధ ట్యాంకుతో నదిని దాటే విన్యాసాలు చేపడుతున్న భారత జవాన్లు ఆకస్మిక వరద కారణంగా మృత్యువాత పడడం తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు మరణించారు. వీరిలో ముగ్గురు ఏపీకి చెందిన జవాన్లు ఉన్నారు. దీనిపై ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. లడఖ్‌లో యుద్ధ ట్యాంకు నదిలో కొట్టుకుపోయిన ప్రమాదంలో జవాన్లు మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం జవాన్ల త్యాగాలు మరువలేనివని తెలిపారు. మరణించిన జవాన్లలో కృష్ణా జిల్లాకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లాకు చెందిన ముత్తుమల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లాకు చెందిన సుభాన్ ఖాన్ ఉండడం బాధాకరమని జగన్ వెల్లడించారు. “మృతి చెందిన జవాన్లకు నివాళులు అర్పిస్తున్నాను. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ప్రమాదంలో అసువులు బాసిన తెలుగు జవాన్ల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను” అంటూ మాజీ సీఎం జగన్ ట్వీట్ చేశారు.

# మాట మార్చుడు లేదు.. మడమ తిప్పుడు లేదు

## విడతల వారీ డ్రామాలు లేవు : మంత్రి నారా లోకేష్



**విజయవాడ, ప్రజానావ:** ఏపీ వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. దీంతో పింఛన్లు అందుకున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం ‘ఎన్టీఆర్ భరోసా’ సామాజిక పింఛన్ల పథకాన్ని ప్రారంభించిన అనంతరం మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో పింఛనుదారులకు స్వయంగా పెన్షన్ అందజేశారు. ఇక పింఛన్ పంపిణీపై మంత్రి నారా లోకేశ్ ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. “ఈరోజు అవ్వాతాతల కళ్లల్లో నేను చూసిన ఆనందం, చిరునవ్వు నా జీవితాంతం గుర్తుంటుంది. ప్రజా నాయకుడికి, పరదాల నాయకుడికి మధ్య ఉన్న తేడా ఈరోజు ప్రజలకు అర్థమైంది. మాట మార్చుడు లేదు.. మడమ తిప్పుడు లేదు.. విడతల వారీ డ్రామాలు లేవు.. అడ్డమైన నిబంధనలు అసలే లేవు.. ఇచ్చిన హామీ ప్రకారం పెద్ద కొడుకుగా పెన్షన్ రూ.4 వేలు చేశారు చంద్రన్న. అరియర్స్‌తో కలిపి రూ.7వేల పెన్షన్ ఇంటి వద్దనే అందజేశారు’ అని ట్వీట్ చేశారు.

# ఊరురా పింఛన్ల సందడి


- ఏపీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రారంభం
- స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్ అందజేసిన సీఎం బాబు
- 90 శాతం పెన్షన్లు పంపిణీ చేసేలా చర్యలు
- గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- రాష్ట్ర వ్యాప్తంగా 65,18,496 మంది లబ్ధిదారులు



**మంగళగిరి, ప్రజానావ:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మంగళగిరి నియోజకవర్గం పెనుమాక ఎస్టీ కాలనీలో సీఎం చంద్రబాబు నాయుడు పేదలపై శ్రద్ధపెడతామని, అనునిత్యం వినూత్నంగా ఆలోచిస్తామన్నారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం చూడాలన్నదే తన ఆలోచనని వెల్లడించారు. దివ్యాంగులకు పింఛన్‌ను రూ.6వేలు చేశామని తెలిపా రు. వారికి చేయూతనివ్వడం సమాజం బాధ్యత చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయాల్సి ఉందన్నారు. గత పాలకులు, అధికారులు సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ తమ వల్ల కాదన్నారని, నేడు 1.25 లక్షల మంది సచివాలయ సిబ్బందితో పంపిణీ జరుగుతున్నదని వెల్లడించారు. తర్వలోనే 183 అన్నా క్యాంటిన్లు ప్రారంభిస్తామన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వానికి శక్తి వస్తే ప్రజలకు మరింత తిరిగి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. తమది ప్రజా ప్రభుత్వమని, నిరంతరం ప్రజలకోసం పనిచేస్తాన్నారు. స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.7 వేల పింఛన్ మొత్తాన్ని అర్హులకు అందిస్తున్నది. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వంలో మొదటగా పెన్షన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే నిజమైన సంక్షేమమని చెప్పారు. వారి జీవన ప్రమాణాల పెంపులో మొదటి అడుగు పడిందని తెలిపారు. సమాజమే దేవాలయమని, ప్రజలే దేవుళ్లని ఎన్టీఆర్ చెప్పారని, ఆయన స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు పింఛనుదారులకు రూ.3వేల చొప్పున అందుతుండగా.. సీఎం చంద్రబాబు తాజాగా ఆ మొత్తానికి రూ.4 వేలుగా చేశారు. దీంతోపాటు ఏప్రిల్ నుంచే పెంచిన దానిని అమలు చేస్తామన్న ఎన్నికల హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ.1,000 చొప్పున కలిపి మొత్తం రూ.7 వేలు నేడు పంపిణీ చేస్తున్నారు. మొత్తం 65.18 లక్షల మందికి పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.4,408 కోట్లు విడుదల చేసింది.

# హస్తినకు సీఎం చంద్రబాబు

- ఈ నెల 4న ఢిల్లీకి ప్రయాణం
- మోడీ, నిర్మలా సీతారామన్‌తో భేటీ
- విభజన హామీల అమలుపై చర్చించే అవకాశం
- త్వరలోనే బడ్జెట్ సమావేశాలకు కేంద్రం రెడీ
- ఏపీకి కేటాయింపులు, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై చర్చ



**అమరావతి, ప్రజానావ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలోనే ఢిల్లీ వెళ్లనున్నారు. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు ఢిల్లీ వెళ్లడం ఇదే తొలిసారి. జులై నాలుగో తేదీన చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నట్లు సమాచారం. జులై నెలాఖరులో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నట్లు సమాచారం. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఏపీకి నిధుల కేటాయింపుపై ఆర్థిక మంత్రితో చంద్రబాబు చర్చించే అవకాశం ఉంది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి పలు హామీలతో ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వాటిని అమలు చేయాల్సిన అవసరం ఉంది. వీటికి తోడు పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి కూడా భారీగా నిధులు కావాల్సి ఉంది. అయితే ఏపీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో.. కేంద్రం ద్వారా బడ్జెట్‌లో ఏపీకి భారీగా నిధులు సాధించుకునేందుకు చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నట్లు తెలిసింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగే భేటీలో బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కొత్తగా తెచ్చుకోవాల్సిన పథకాలపై చర్చించే అవకాశం ఉంది. మరోవైపు ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు నాయుడు తొలిసారిగా హస్తినకు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనూ భేటీ కానున్నట్లు సమాచారం. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణం వంటి అంశాలను ఆయనతో చర్చించే అవకాశాలు ఉన్నాయి. పోలవరం నిర్మాణంపై ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు.. దీనిపై కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖతోనూ చర్చించే అవకాశాలు ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించింది. వీరు చేసిన సలహాలు, సూచనలను చంద్రబాబు.. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ వద్ద ప్రస్తావించనున్నారు. మొత్తంగా ఏపీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా చంద్రబాబు ఢిల్లీ వెళ్తుండటం.. అందులోనూ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు వెళ్తున్న నేపథ్యంలో ఈ విషయం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కీలకంగా మారిన పరిస్థితుల్లో.. చంద్రబాబు ఏ మేరకు నిధులు సాధిస్తారనేదీ ఆసక్తికరంగా మారింది.

# మంత్రి నిమ్మల రామానాయుడు ఔరా

- కాళ్లు కడిగి పెన్షన్ అందజేత
- వృద్ధులు, వికలాంగుల కాళ్లు కడిగిన మంత్రి నిమ్మల



**పశ్చిమ గోదావరి, ప్రజానావ:** ఏపీలో పెన్షన్ల పంపిణీ జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు పశ్చిమగోదావరి జిల్లా యలమంచలీ మండలం అడవిపాలెంలో అనారోగ్యానికి గురయిన లారీ డ్రైవర్‌కు తొలి పింఛన్ అందించి కాళ్లకు నమస్కరించారు. ఇదే గ్రామానికి చెందిన పెదపాటి భాగ్యలక్ష్మి కాళ్లు కడిగారు మంత్రి. అలాగే పాలకొల్లులో లబ్ధిదారులకు నగదు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని మంత్రి తెలిపారు. టీడీపీ కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. ఈ క్రమంలో ఆయన వృద్ధులు, వికలాంగుల కాళ్లు కడిగారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ప్రతి నెల పెరిగిన పెన్షన్ లబ్ధిదారుల ఇంటికి చేరుతుందన్నారు. కాగా, సీఎం చంద్రబాబు ‘ఎన్టీఆర్ భరోసా’ సామాజిక పింఛన్ల పంపిణీని సోమవారం ఉదయం ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో లబ్ధిదారు ఇంటికి వెళ్లి స్వయంగా తన చేతుల మీదుగా పెన్షన్ అందజేశారు. పెన్షన్ రూ.4 వేలతో పాటు, ఏప్రిల్ నుంచి మూడు నెలల పెంపు రూ.3 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు అందజేశారు.



# ఆ ఎమ్మెల్యేలిద్దరినీ విప్‌లుగా ప్రకటించండి

## సీఎం చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ లేఖ

**విజయవాడ, ప్రజానావ:** జనసేన పార్టీ ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, అరవ శ్రీధర్ లను అధికారిక విప్‌లుగా నియమించాలని కోరుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోమవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ మేరకు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన బొమ్మిడి నాయకర్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నరసాపురం స్థానం నుంచి గెలుపొందారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన అరవ శ్రీధర్ రైల్వే కోడూరు అసెంబ్లీ స్థానం నుంచి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున అధినేత పవన్ కళ్యాణ్ సహా మొత్తం 21 మంది పోటీ చేయగా, 21 మంది విజయం సాధించడం విశేషం. పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ లకు ఏపీ క్యాబినెట్ లో స్థానం దక్కింది.



# సీఎం చంద్రబాబుకు ధైర్యం లేదా?

- ప్రత్యేక హోదాపై నోరు మెదపడం లేదు
- ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్

**కడప, ప్రజానావ:** తమకు ప్రత్యేక హోదా కావాలని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీర్మానం చేసి ప్రధాని మోడీ ముందు పెట్టారని, కానీ ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం ప్రత్యేక హోదాపై ఇప్పటి వరకు నోరు ఎందుకు మెదపడం లేదని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వంలో కింగ్ మేకర్‌గా ఉన్న చంద్రబాబు హోదా విషయంలో సైలెంట్‌గా ఎందుకున్నారని, ఈ విషయంలో ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా బీహార్ కంటే ఏపీ వెనుకబడి వుందని, హోదా కావాలని 15 ఏళ్లు అడిగిన విషయం మీకు గుర్తులేదా? అని చంద్రబాబును షర్మిల ప్రశ్నించారు. “రాష్ట్రాభివృద్ధిలో ఏపీ 20 ఏళ్లు వెనకబడిందని చెప్పింది మీరే కదా. హోదా ఇవ్వకుంటే మద్దతు ఉపసంహరిస్తామని ఎందుకు అనడం లేదు. మోసం చేసిన మోడీతో హోదాపై సంతకం ఎందుకు పెట్టించలేరు? ప్రత్యేక హోదాపై మీ వైఖరి ఏంటో చెప్పాలి. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం ముందు హోదా డిమాండ్‌ను పెట్టాలి” అని చంద్రబాబును కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని షర్మిల తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీలు కాదని, రాష్ట్రాభివృద్ధికి హోదా ఒక్కటే మార్గమని మరోమారు గుర్తుచేస్తున్నట్టు షర్మిల పేర్కొన్నారు.




# కలెక్షన్లలో దూసుకుపోతున్న కల్కి

## 4రోజుల్లోనే రూ.555 కోట్ల మార్క్ టచ్

టాలీవుడ్‌తో పాటు వరల్డ్ వైడ్‌గా కల్కి 2898 ఏడీ సత్తా చాటుతుంది. మొదటిరోజు నుంచే కలెక్షన్ల సూనామీ సృష్టిస్తున్న ఈ చిత్రం నాలుగో రోజు కూడా అదే రిపీట్ చేసింది. పాన్‌ఇండియా స్టార్ హీరో ప్రభాస్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించగా వైజయంతీ మూవీస్ తెరకెక్కించింది. ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో జూన్ 27 గురువారం ప్రేక్షకుల మందుకు వచ్చి మొదటి రోజు నుంచే భారీ వసూళ్లను రాబడుతుంది. ఓపెనింగ్ రోజే రూ.191.50 కోట్లు వసూల్ చేసిన సినిమా మూడు రోజుల్లోనే రూ.415 కోట్లు వసూళ్లను రాబట్టింది. ఇక తాజాగా ఆదివారం కలెక్షన్స్‌ను చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా 4రోజుల్లోనే రూ.555 కోట్ల మార్క్ టచ్ చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు ఇండస్ట్రీలో రూ.500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిన చిత్రాలలో కల్కి ఐదో సినిమాగా నిలిచింది. ఇంతకుముందు ఈ రికార్డు బాహుబలి- 1, 2, ఆర్ఆర్ఆర్, సలార్ పేరిటా ఉన్నాయి. విశేషం ఎంటంటే ఇందులో నాలుగు సినిమాలు ప్రభాస్‌వే కావడం విశేషం. మరోవైపు ఈ వారం టికెట్లు రేట్లు తగ్గనుండడంతో మూవీ కలెక్షన్లు మరింత పేరిగే అవకాశం ఉంది. సినిమాలో ప్రభాస్, దీపికా పదుకోణె, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటాని, రాజేంద్ర ప్రసాద్, శోభన తదితరులు ముఖ్యపాత్రల్లో నటించగా.. టాలీవుడ్ స్టార్ నటుడు విజయ్ దేవరకొండ అర్జునుడి పాత్రలో మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ ఒక యోధుడి పాత్రలో కనిపించాడు. ఇంకా వీళ్లే కాకుండా సీతారామం భామ మృణాల్ ఠాకూర్, మలయాళ నటి అన్నా బెన్, హాస్య నటుడు బ్రహ్మానందం, టాలీవుడ్ దర్శకులు ఆర్జీవీ, రాజమౌళి, జాతి రత్నాలు దర్శకుడు కేవీ అనుదీప్, ఫరియా అబ్దుల్లా, అవసరాల శ్రీనివాస్ తదితరులు ఇందులో నటించారు.


# బచ్చల మల్లి'గా అల్లరి నరేశ్




ఇటీవలే 'ఆ.. ఒక్కటీ అడక్కు' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొ చ్చారు అల్లరి నరేశ్. ఇప్పుడు 'బచ్చల మల్లి'గా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాని సుబ్బు మంగదేవి తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా, బాలాజీ గుత్తా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అమృత అయ్యర్ కథానాయిక. రావు రమేశ్, రోహిణి తదితరు లు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఆదివారం అల్లరి నరేశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఓ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో నరేశ్ మాస్ రగ్గడ్ లుక్‌లో మునుపెన్నడూ చూడని విధంగా కనిపించారు. ఇంటి ముందు భగవద్గీత వినిపిస్తున్న మైక్ సెట్‌ను విసిరికొట్టడం.. బార్‌లో శత్రువులపై విరుచుకుపడిన తీరు.. ఈ చిత్రంలో ఆయన పాత్ర ఎంత మాస్‌గా కనిపించనుందో తెలియజేస్తున్నాయి. 'ఏయ్ ఎవడి కోసం తగ్గాలి.. ఎందుకు తగ్గాలి' అంటూ ఆఖర్లో నరేశ్ చెప్పిన డైలాగ్ ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా సెప్టెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది. అల్లరి నరేశ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం తన నుంచి ఓ కొత్త కబురు వినిపించింది. 'ఫ్యామిలీ డ్రామా' అనే చిత్రంతో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని మెప్పించిన మెహర్ తేజ్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అంటూ చిత్ర నిర్మాతలు విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్ ఆసక్తిరేకెత్తించేలా ఉంది. దీన్ని బట్టి ఇదొక వైవిధ్యభరితమైన కథతో రూపొందనున్నట్లు అర్థమవుతోంది. అంతేకాదు దీంట్లో నరేశ్ పాత్ర అందర్నీ ఆశ్చర్యపరిచే విధంగా ఉంటుందని తెలిసింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

# అజిత్ తాజా చిత్రం విడాముయర్చి

తమిళ స్టార్ నటుడు అజిత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి'. ఏకే 62గా వస్తున్న ఈ సినిమాకు మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. ఎంత వాడు గాని తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా రానుండటంతో మూవీ భారీ అంచనాలు ఉన్నాయి. ఈ మూవీ నుంచి ఎప్పుడెప్పుడు అప్‌డేట్ వస్తుందా? అజిత్ లుక్ ఎలా ఉంటుందా అని ప్రేక్షకులు ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వారికి గుడ్ న్యూస్ అందిస్తూ మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇక ఈ ఫస్ట్ లుక్ ప్రస్తుతం నెట్టింట హాల్ చల్ చేస్తోంది. కోలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్, రెజీనా కసాండ్రా, అరవ్ కిజర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాబోతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు





# పంద్రాగస్ట్ రోజు రానున్న తంగలాన్

కోలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా ప్రేక్షకుల ఎదురుచూ స్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రాలలో తంగలాన్ ఒకటి. తమిళ హీరో చియాన్ విక్రమ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు 'కబాలి', 'కాలా', 'సర్పట్ట పరంపర' చిత్రాల ఫేమ్ పా రంజిత్ దర్శకత్వం వహిస్తు న్నాడు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ రావడంతో పాటు సినిమాపై భారీ అంచనాలను పెంచేశా యి. ఇక ఈ సినిమా విడుదల తేదీ ఎప్పడు వస్తుందా ఎప్పడెప్పడు చూద్దామా అని ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాను మొదట జనవరి 26 విడుదల చేసేందుకు మేకర్స్ చేసిన విషయం తెలిసిందే. అనుకోని కారణాల వలన వాయిదా పడింది. ఇక ఆ తర్వాత ఫిబ్రవరిలో విడుదల చేద్దామనుకున్నారు మేకర్స్. కానీ అప్పడు కూడా ఈ సినిమాకు కలిసి రాలేదు. అయితే తాజాగా ఈ మూవీ విడుదల తేదీపై ఒక సాలిడ్ అప్‌డేట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మూవీని ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయడానికి మేకర్స్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆగష్టు 15 రేసులో ఉన్న పుష్ప 6 డిసెంబర్‌కు వాయిదా పడగా.. ఆ స్థానంలో రామ్- పూరీ కాంబోలో వస్తున్న డబల్ ఇస్మార్ట్ వస్తుంది. ఇక ఆగష్టు 15 కి తంగలాన్ కూడా వస్తే బాక్సాఫీస్ క్లాష్ ఏర్పడే అవకాశం ఉంది.కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొతు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. 'సర్పట్ట పరంపర' ఫేమ్ పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు. . ఈ చిత్రం విడుదల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనిపై సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ అప్‌డేట్ ఇచ్చారు. 'సినిమా మ్యూజిక్ పనులు పూర్తయ్యాయి. నాకు సాధ్యమైనంతవరకు బెస్ట్ మ్యూజిక్ ఇచ్చాను. సినిమా అద్భుతంగా వచ్చింది. త్వరలోనే మైండ్ బ్లోయింగ్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. మరో ఇండియన్ మూవీ చరిత్ర సృష్టించనుంది' అని పేర్కొన్నారు. ఇప్పటికే దీని టీజర్‌కు భారీ స్పందన వచ్చింది. ఓ సందర్భంలో విక్రమ్ దీని గురించి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఏ సినిమా కోసం ఇంత కష్టపడలేదన్నారు. విభిన్నకథతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో గ్లామర్‌కు చోటులేదన్నారు. ఈ సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు మరో ప్రపంచంలోకి వెళ్తారని హామీ ఇచ్చారు.



# ఇక హిందీలోనూ ..ఆకాశమే నీ హద్దురా..!

మహిళా దర్శకుల్లో సుధా కొంగరకు ప్రత్యేక శైలి ఉంది. ఆమె ఎంచుకునే కథలు, తెరకెక్కించే తీరు విభిన్నం. అందుకు ఆమె తెరకెక్కించిన చిత్రాలే నిదర్శనం. ప్రస్తుతం ఆమె 'సర్ఫిరా' సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. అక్షయ్ కుమార్ హీరోగా నటించిన ఈ చిత్రం సూర్య నటించిన 'ఆకాశం నీ హద్దురా'కు రీమేక్‌గా తెరకెక్కింది. జులై 12న విడుదలకానుంది. అయితే ఈ చిత్రం తర్వాత పైప్‌లైన్లో ఏ చిత్రం ఉందనే విషయాన్ని సుధా ఇప్పటిదాకా వెల్లడించలేదు. సూర్యతో 'పురాణనూరు' అనే చిత్రం చేయనున్నట్లు ఓ ప్రకటన వచ్చింది. అయితే అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే ఆ చిత్రం ఆగిపోయిందనే టాక్ కూడా నడుస్తోంది. కోలీవుడ్ మీడియా వార్తల ప్రకారం సుధా తదుపరి చిత్రం ధనుష్‌తో ఉంటుందని టాక్. ఇప్పటికే ఈ విషయ-ంమై సంప్రదింపులు, చర్చలు మొదలైనట్లు సన్నిహిత వర్గాల నుంచి సమాచారం. సూర్యతో చేయాల్సిన కథనే ధనుష్‌తో చే?స అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'సర్ఫిరా' విడుదల తర్వాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ధనుష్ ప్రస్తుతం 'రాయన్'తో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే శేఖర్ కమ్ముల దర్శకత్వంలో 'కుబేర' చిత్రంలో నటిస్తున్నారు.

# హిందువుల పట్ల కపటత్వం బయటపడింది

## రాహుల్‌పై నిర్మలా సీతారామన్ ఫైర్



**న్యూ ఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందువుల పట్ల ద్వేషంతో ప్రారంభమైన రాహుల్ గాంధీ బుజ్జగింపు రాజకీయాలు హిందువుల పట్ల ద్వేషంతో ముగుస్తాయని వ్యాఖ్యానించారు. విపక్ష కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ ఆయన బాటనే అనుసరిస్తాయని సోమవారం పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ చర్చలో పాల్గొంటూ హిందువులు 24 గంటలూ ద్వేషం, హింసకు పాల్పడటంపైనే దృష్టిని కేంద్రీకరిస్తారంటూ అధికార బీజేపీని ఉద్దేశించి మాట్లాడారు. దీనిపై అధికార పక్షం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చర్చలో జోక్యం చేసుకుంటూ యావత్తు హిందూ సమాజానికి హింసను ఆపాదించడం తీవ్రమైన అంశం అని పేర్కొన్నారు. ప్రధాని మోడీ వ్యాఖ్యలను తిప్పి కొట్టిన రాహుల్ గాంధీ.. తాను బీజేపీ గురించి మాట్లాడుతున్నానని తేల్చి చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రమే హిందూ సమాజానికి ప్రతినిధులు కారంటూ తిప్పి కొట్టారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'తనను తాను హిందువుగా చెప్పుకుంటున్న విపక్ష నేత రాహుల్ గాంధీ.. హిందువులంతా ద్వేషం, ధిక్కార స్వభావం కలిగి ఉంటారని చెబుతున్నారు. హిందువుల పట్ల ఆయన కపటత్వం బయట పడింది అని వ్యాఖ్యానించారు. 'రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలపై ప్రధాని మాత్రమే స్పందించే హక్కు ఉంది. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలు హిందువుల పట్ల ద్వేషంతో మొదలై ద్వేషంతోనే ముగుస్తాయి. ఆయన బాటనే ఇండియా కూటమి నేతలు అనుసరిస్తారంటే ఆశ్చర్యమేమీ లేదు' అని మరో 'ఎక్స్' పోస్టులో నిర్మలాసీతారామన్ తెలిపారు.

# మోడీ విద్వేష ప్రసంగాలతో రెచ్చగొట్టారు


- అందుకే బీజేపీకి ఆ తీర్పు
- ఆర్ఎస్ఎస్ భావజాలం దేశానికి ప్రమాదకరం
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా రాజ్యసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మోడీ విద్వేష ప్రసంగాల తో రెచ్చగొట్టారని ప్రతిపక్ష కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రసంగాల్లో ప్రధాని మోడీ విద్వేషాలు రెచ్చగొట్టారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో బీజేపీకి సరైన తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మహిళల మంగళసూత్రాలు అమ్మేస్తారని మోడీ తప్పుడు ప్రచారం చేశారు. ప్రధాని స్థాయిలో ఉండి విద్వేష ప్రసంగాలు చేయడం సరికాదు. మోడీ ఓటర్లను అవమానించారు.' అని అన్నారు. 'ఆర్ఎస్ఎస్ భావజాలం దేశానికి ప్రమాదకరం. మహిళలు, దళితులకు విద్యను నిరాకరిస్తున్నారు.' అని ఖర్గే వ్యాఖ్యానించారు. ఖర్గే వ్యాఖ్యలను అధికార పక్షం తప్పుపట్టింది. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని బీజేపీ ఎంపీ జేపీ నడ్డా ఛైర్మన్‌ను కోరగా.. ఖర్గే వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు.

# రాహుల్ తప్పుదోవ పట్టిస్తున్నారు

- అగ్నివీర్ చనిపోతే కోటి పరిహారం ఇస్తున్నాం
- రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్



**న్యూఢిల్లీ:** ఎవరైనా అగ్నివీర్ చనిపోతే, వాళ్ల కుటుంబానికి కోటి నష్టపరిహారం ఇస్తున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. లోక్‌సభలో మంత్రి రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. తప్పుడు ఆరోపణల తో సభను రాహుల్ తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఇవాళ రాహుల్ గాంధీ మాట్లాడారు. ఆర్మీకి వ్యతిరేకంగా అగ్నివీర్ స్కీమ్ ఉందన్నారు. దేశభక్తులు కూడా ఆ స్కీమ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఓ అగ్నివీర్.. ల్యాండ్‌మైన్ పేలుడులో ప్రాణాలు కోల్పోయాడని, అతన్ని తాను అమరుడిగా పిలుస్తానని, కానీ ఈ ప్రభుత్వం పిలవడం లేదని, ఆ వీరుడి కుటుంబానికి ఎటువంటి లబ్ధి చేకూరడం లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ సమయంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ జోక్యం చేసుకున్నారు. యాక్షన్‌లో ఉన్న అగ్నివీర్ చనిపోతే కోటి సాయాన్ని ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. తప్పుడు స్టేట్మెంట్లతో సభను తప్పు దోవ పట్టించవద్దు అని పేర్కొన్నారు. బోర్డర్‌ను రక్షిస్తు న్న సమయంలో కానీ, యుద్ధంలో కానీ ఎవరైనా అగ్నివీర్ తన ప్రాణాలను కోల్పోతే అప్పుడు ఆ కుటుంబానికి పరిహారం ఇస్తున్నట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు.

# యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలు రిలీజ్

- గత జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష
- 2 పేపర్లు కలిపి 200 మార్కులకు పరీక్ష

**న్యూఢిల్లీ:** యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్-2024 ఫలితాలు విడుదలయ్యాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం సాయంత్రం ఫలితాలను విడుదల చేసింది. అభ్యర్థులు upsc.gov.in వెబ్‌సైట్‌లో ఫలితాలను చెక్ చేసుకోవచ్చని యూపీఎస్సీ తెలిపింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను కూడా ఇప్పటికే విడుదల చేశారు. గత ఏడాది మే 26న సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించి జూన్ 12న ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి నిన్న ఫలితాలు వెల్లడించారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ 2024 పరీక్షలను రెండు షిఫ్టుల్లో నిర్వహించారు. జనరల్ స్టడీస్ పేపర్-1, పేపర్-2 లకు కలిపి మొత్తం 200 మార్కులకు పరీక్ష జరిగింది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ రాయాల్సి ఉంటుంది. మెయిన్స్‌లో రాతపరీక్ష, పర్సనాలిటీ టెస్ట్ ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్ పరీక్షలు సెప్టెంబర్ 20 నుంచి జరగాల్సి వచ్చింది.

ఫలితాల కోసం ముందుగా యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలి. తర్వాత యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) రిజల్ట్-2024 లింకుపై క్లిక్ చేయాలి. కొత్తపేజీ ఓపెన్ కాగానే అభ్యర్థి వివరాలను నింపి సబ్‌మిట్ బటన్ క్లిక్ చేయాలి. వెంటనే మీ ఫలితాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి.

# అమల్లోకి కొత్త నేర చట్టాలు

- ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత
- సీఆర్‌పీసీ బదులు భారతీయ నాగరిక సురక్షి సంహిత
- ఎవిడెన్స్ యాక్ట్ ఇకపై భారతీయ సాక్ష్య అధినియమ్



**న్యూ ఢిల్లీ:** జులై 1 నుంచి మూడు కొత్త క్రిమినల్ చట్టాలు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇవి.. భారతదేశ క్రిమినల్ న్యాయ వ్యవస్థను గణనీయంగా మారుస్తాయి. వలసరాజ్య కాలం నాటి చట్టాలను ఇవి భర్తీ చేస్తాయి. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సక్షా అధినియం.. పాత భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో రానున్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు వీటి గురించి కచ్చితంగా తెలుసుకోవాల్సిన 10 విషయాలను ఇక్కడ చూడండి. కొత్త క్రిమినల్ చట్టాలు..

- విచారణ ముగిసిన 45 రోజుల్లోగా క్రిమినల్ కేసు తీర్పులు వెలువరించాలి. మొదటి విచారణ జరిగిన 60 రోజుల్లోగా అభియోగాలు నమోదు చేయాలి. సాక్షుల భద్రత, సహకారం కోసం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సాక్షి రక్షణ పథకాలను అమలు చేయాలి.
- అత్యాచార బాధితుల వాంగ్మూలాలను బాధితుల సంరక్షకుడు లేదా బంధువు సమక్షంలో మహిళా పోలీసు అధికారి నమోదు చేయాలి. ఏడు రోజుల్లో మెడికల్ రిపోర్టులు పూర్తి చేయాలి.
- మహిళలు, చిన్నారులపై నేరాలను పరిష్కరిస్తూ చట్టంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. పిల్లలను కొనడం లేదా అమ్మడం హేయమైన నేరంగా వర్గీకరించారు. ఇది తీవ్రమైన శిక్షార్హమైనది. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశం ఉంది.
- పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మహిళలను వదిలేసిన కేసులకూ ఇప్పుడు చట్టంలో శిక్షలు ఉన్నాయి.
- నేరాలకు గురైన మహిళా బాధితులు 90 రోజుల్లోగా తమ కేసులకు సంబంధించిన రెగ్యులర్ అప్డేట్స్ పొందే హక్కు ఉంది. నేరానికి గురైన మహిళలు, చిన్నారులకు అన్ని ఆసుపత్రులు ఉచితంగా ప్రథమ చికిత్స లేదా వైద్య చికిత్స అందించాలి.
- ఎఫ్ఐఆర్ కాపీలు, పోలీస్ రిపోర్టు, చార్జిషీట్, స్టేట్మెంట్లు, కన్ఫెషన్లు, ఇతర డాక్యుమెంట్ల కాపీలను 14 రోజుల్లోగా పొందడానికి నిందితుడు, బాధితురాలు అర్హులు. కేసుల విచారణలో అనవసర జాప్యాన్ని నివారించడానికి కోర్టులు గరిష్ఠంగా రెండు వాయిదాలకు అనుమతిస్తాయి.
- పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా సంఘటనలను నివేదించవచ్చు. జీరో ఎఫ్ఐఆర్ ప్రవేశపెట్టడం వల్ల వ్యక్తులు అధికార పరిధితో సంబంధం లేకుండా ఏదైనా పోలీస్ స్టేషన్‌లో ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ దాఖలు చేయవచ్చు.
- అరెస్టయిన వ్యక్తికి వారి పరిస్థితి గురించి తెలియజేసే హక్కు ఉంది. తద్వారా అతను తక్షణ మద్దతును పొందగలడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు సులభంగా అందుబాటులో ఉండేలా పోలీస్ స్టేషన్లు, జిల్లా కేంద్రాల్లో అరెస్టు వివరాలను ప్రముఖంగా ప్రదర్శిస్తారు.
- తీవ్రమైన నేరాలకు సంబంధించి ఫోరెన్సిక్ నిపుణులు ఘటనాస్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించడం ఇప్పుడు తప్పనిసరి.
- "లింగం" నిర్వచనంలో ఇప్పుడు ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు సైతం ఉన్నారు. మహిళలకు సంబంధించిన పలు నేరాలకు.. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ నమోదు చేయాలి. ఒకవేళ అందుబాటులో లేకపోతే, పురుష మేజిస్ట్రేట్ ఒక మహిళ సమక్షంలో వాంగ్మూలాన్ని నమోదు చేయాలి. అత్యాచారానికి సంబంధించిన వాంగ్మూలాలను ఆడియో-వీడియో ద్వారా రికార్డు చేయాలి.

# సంపన్నులకు ఉపయోగపడేలా నీట్ డిజైన్

- ప్రతిభ, కల విద్యార్థుల కోసం కాదు
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



**న్యూ ఢిల్లీ:** నీట్ పరీక్ష లోటుపాట్లపై మోదీ సర్కార్ లక్ష్యంగా విపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో విమర్శలు గుప్పించారు. నీట్ విద్యార్థులు పరీక్ష కోసం ఏండ్ల తరబడి సన్నద్ధమయ్యారని, వారి కుటుంబం విద్యార్థులకు ఆర్థికంగా, నైతికంగా వెన్నుదన్నుగా నిలిచిందని అన్నారు. నీట్ పరీక్ష ధనవంతులను దృష్టిలో ఉంచుకుని డిజైన్ చేశారని, ప్రతిభ కల విద్యార్థుల కోసం కాదని వారికి అర్థమవడంతో పరీక్షపైనే విద్యార్థులు విశ్వాసం కోల్పోయారని చెప్పారు. తాను పలువురు నీట్ విద్యార్థులను కలిశానని, సంపన్నులు సులభంగా పాస్ అయ్యేలా వారి కోసం కోటాను సృష్టించేలా పరీక్షను డిజైన్ చేశారని సదరు విద్యార్థులు తనతో చెప్పారని పేర్కొన్నారు. నీట్ పరీక్షను పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా మలిచేలా డిజైన్ చేయలేదని విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా వారు వాపోయారని గుర్తుచేసుకున్నారు. ఇక అంతకుముందు రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడుతూ ఈ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగంపై దాడి జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు తాము పోరాడుతున్నామని అన్నారు. ఇండియా కూటమి నేతలను ప్రభుత్వ ప్రోద్భలంతో ఈడీ, సీబీఐ వేధిస్తున్నాయని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టి విపక్ష నేతలను వేధిస్తూ వారిని జైల్లో పెట్టి హింసిస్తున్నారని అన్నారు. శివుడి ఫొటోను చూపుతూ తాను శివుడి నుంచి ప్రేరణ పొందానని అన్నారు. శివుడి ఫొటోను, రాజ్యాంగ ప్రతిని సభలో చూపడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. కేంద్రం ఆదేశాలతో తనను టార్గెట్ చేశారని దయ్యబట్టారు. నా సభ్యత్వాన్ని రద్దు చేసి, ఎంపీ పదవినీ, ఇంటినీ లాక్కున్నారని అన్నారు. విపక్షంలో ఉన్నందుకు గర్వపడుతున్నామని అన్నారు. ఓ సినిమాతో మహాత్మా గాంధీ అంటే ప్రపంచానికి తెలిసిందని ప్రధాని మోడీ అన్నారని, ఆయన అజ్ఞానాన్ని అర్థం చేసుకున్నారా అని ప్రశ్నించారు.

# పశ్చిమ బెంగాల్‌లో మహిళలకు భద్రత లేదు

- దాడులు జరుగుతుంటే దీదీ ప్రభుత్వం ఏం చేస్తుంది?
- కేంద్ర మంత్రి జేపీ నడ్డా



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఓ జంటపై జరిగిన దాడిపై బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా ఇవాళ స్పందించారు. రాష్ట్రంలో బహిరంగంగా దాడులు జరుగుతుంటే దీదీ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా నడ్డా స్పందించారు.. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఓ అమానవీయ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది అని ప్రస్తావించారు. మతం పేరుతో చేస్తున్న క్రూరత్వానికి ఇది నిదర్శనం అంటూ ఆయన మండిపడ్డారు. దీనిని వ్యతిరేకించడానికి బదులు తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు సమర్థిస్తున్నారు. సందేశ్‌ఖాలీ, ఉత్తర దినాజ్‌పూర్ ఇలా ఏ ప్రాంతాల్లోనూ మహిళలకు తగిన భద్రత లేదు అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మహిళలకు సురక్షితం కాదు అని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. వివాహేతర సంబంధం పెట్టుకున్నారన్న కారణంగా బెంగాల్‌లో ఓ జంటను నడిరోడ్డుపై దారుణంగా చావగొట్టిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఈ వీడియోలో వెదురుకర్రతో ఓ జంటను ఇష్టం వచ్చినట్లు కొడుతున్న వ్యక్తి ఉత్తర్ దినాజ్‌పూర్ జిల్లాలోని చోప్రా ప్రాంత టీఎంసీ నేత తాజ్‌ముల్ అలియాస్ జేసీబీగా పోలీసులు గుర్తించి అరెస్టు చేసేశారు. సుమోటోగా కేసు నమోదుచేసిన పోలీసులు బాధిత జంటకు రక్షణ కల్పించినట్లు వెల్లడించారు.



# రాహుల్ గాంధీ ఎవరినీ అవమానించలే

## ప్రియాంక గాంధీ

**న్యూ ఢిల్లీ:** విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సోమవారం తన లోక్‌సభ ప్రసంగంలో ఎక్కడా హిందువులను అవమానించలేదని ఆ పార్టీ నేత ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. రాహుల్ హిందువులను అవమానించలేదని పేర్కొన్నారు. తాను బీజేపీతో పాటు ఆ పార్టీ నేతల తీరు గురించే మాట్లాడానని రాహుల్ స్పష్టంగా చెప్పారని ఆమె గుర్తుచేశారు. పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కాగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై చర్చ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం లోక్‌సభ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మోదీ సర్కార్ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగంపై దాడి జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తాను మరో అంశం గమనించానని, ధైర్యం గురించి మాట్లాడేది కేవలం ఒక మతం కాదు. అన్ని మతాలు ధైర్యం గురించి మాట్లాడతాయని అన్నారు. అధికారం, సంపద కేంద్రీకరణ, పేదలు, దళితులపై దమనకాండ గురించి ప్రశ్నించిన వారిని అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, రైతుల సమస్యలు కేంద్రానికి పట్టవని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు తాము పోరాడుతున్నామని అన్నారు. ఇండియా కూటమి నేతలను ప్రభుత్వ ప్రోద్భలంతో ఈడీ, సీబీఐ వేధిస్తున్నాయని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టి విపక్ష నేతలను వేధిస్తూ వారిని జైల్లో పెట్టి హింసిస్తున్నారని అన్నారు. శివుడి ఫొటోను చూపుతూ తాను శివుడి నుంచి ప్రేరణ పొందానని అన్నారు. శివుడి ఫొటోను, రాజ్యాంగ ప్రతిని సభలో చూపడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. కేంద్రం ఆదేశాలతో తనను టార్గెట్ చేశారని దయ్యబట్టారు. నా సభ్యత్వాన్ని రద్దు చేసి, ఎంపీ పదవినీ, ఇంటినీ లాక్కున్నారని అన్నారు. విపక్షంలో ఉన్నందుకు గర్వపడుతున్నామని అన్నారు. ఓ సినిమాతో మహాత్మా గాంధీ అంటే ప్రపంచానికి తెలిసిందని ప్రధాని మోదీ అన్నారని, ఆయన అజ్ఞానాన్ని అర్థం చేసుకున్నారా అని ప్రశ్నించారు.

www.prajanaava.in
హైదరాబాద్
మంగళవారం, జూలై 2, 2024
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# భారత్ విజయభేరీ

- సౌతాఫ్రికాపై టెస్టు మ్యాచ్‌లో విజయం
- 10 వికెట్ల తేడాతో విక్టరీ కొట్టిన భారత మహిళ జట్టు

**చెన్నై:** టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన శుభ సందర్భమో ఏమో కానీ భారత మహిళా క్రికెటర్లు సైతం అద్భుత విజయం సాధించారు. భారత పురుషుల టీమ్ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో సౌతాఫ్రికాను మట్టికరిపించి రెండోసారి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిది. అదే సౌతాఫ్రికాతోనే జరిగిన ఏకైక టెస్ట్‌లో భారత మహిళలు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. రెండు రోజుల వ్యవధిలో భారత అభిమానులకు డబుల్ ధమాకా దక్కగా.. సఫారీలకు మాత్రం కోలుకోలేని దెబ్బ తగిలింది. చెన్నై వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో 37 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన టీమిండియా 9.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని చేధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత మహిళల టీమ్.. తొలి ఇన్నింగ్స్‌లో 603/6 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లెర్ చేసింది. ఓపెనర్ షెఫాలీ వర్మ(197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్స్‌లతో 205) డబుల్ సెంచరీతో చెలరేగగా.. స్మృతి మంధాన(161 బంతుల్లో 27 ఫోర్లు, సిక్స్‌తో 149) శతక్కొట్టింది. హర్మన్ ప్రీత్ కౌర్(69), జెమీమా రోడ్రిగ్స్(55), రిచా ఘోష్(86) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 266 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా(8/77) సఫారీ పతనాన్ని శాసించింది. దీప్తి శర్మకు రెండు వికెట్లు దక్కాయి. 337 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా 373 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ లౌరా వాల్వార్డ్(122), సునె లుస్(109) సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రాజశ్వేరి గైక్వాడ్ రెండేసి వికెట్లు తీయగా.. పూజా వస్త్రాకర్, షెఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్ తలో వికెట్ తీసారు.

## ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ

భారత తొలి ఇన్నింగ్స్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 603 వద్ద డిక్లేర్ చేసింది. టాస్ గెలిచిన టీమిండియాకు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. సఫారీ బౌలర్లను ఉతికేసిన ఓపెనర్ షఫాలీ వర్మ (205) ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీతో రికార్డులు బద్ధలు కొట్టేసింది. ఇక వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలతో మెరిసిన స్మృతి మంధానా (149)ల సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ సఫారీలను బాదేసింది. తొలి వికెట్‌కు ఈ జోడీ 192 పరుగుల రికార్డు భాగస్వామ్యంతో చరిత్ర సృష్టించింది. షఫాలీ, మంధాన మెరుపులతో డీలా పడిన దక్షిణాఫ్రికా బౌలర్లను జెమీమా రోడ్రిగ్స్(55), హర్మన్‌ప్రీత్ కౌర్(69), రీచా ఘోష్(86)లు మరింత ఏడిపించేశారనుకో. ఈ ముగ్గురూ అర్ధ సెంచరీలతో జట్టుకు కొండంత స్కోర్ అందించారు.

# అది మీకు క్యాచ్ ఏమో.. నాకు కప్

## టీమిండియా ప్లేయర్ సూర్య కుమార్ యాదవ్



**ముంబై:** భారత్ జగజ్జేతగా నిలిచింది. టీ20 వరల్డ్ కప్-2024 ఛాంపియన్‌గా అవతరించింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై ఏడు పరుగుల తేడాతో టీమిండియా గెలిచింది. సమష్టి విజయంతో రోహిత్ సేన ట్రోఫీని అందుకుంది. కానీ ఫైనల్లో గేమ్ ఛేజింగ్ మూమెంట్ మాత్రం.. సూర్యకుమార్ యాదవ్ స్టన్నింగ్ క్యాచ్! నరాలు తెగే ఉత్కంఠలో సూర్య కష్టమైన క్యాచ్‌ను అందుకున్న తీరు చరిత్రలో నిలిచిపోతుంది. ఓ వైపు బంతిని గమనిస్తూ.. మరోవైపు బౌండరీ రోప్‌ను అంచనా వేస్తూ...చిరుతలా పరిగెత్తుతూ సూర్యకుమార్ అద్భుతంగా క్యాచ్ అందుకున్నాడు. సౌతాఫ్రికా విజయానికి 6 బంతుల్లో 15 పరుగులు అవసరమవ్వగా హార్దిక్ వేసిన తొలి బంతిని డేవిడ్ మిల్లర్ లాంగాఫ్ దిశగా భారీ షాట్ ఆడాడు. దాదాపు సిక్సర్‌గా దూసుకెళ్లిన ఈ బంతిని సూర్య బౌండరీ లైన్‌పై చాకచక్యంగా అందుకున్నాడు. ముందుగా సిక్సర్‌ను అడ్డుకొన్న సూర్య, తర్వాత సమన్వయం కోల్పోవడంతో బంతి గాల్లోకి విసిరాడు. బౌండరీ రోప్ దాటి, మళ్లీ మైదానంలోకి వచ్చి బంతిని అందుకున్నాడు. ఈ క్యాచ్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. అది సిక్సర్‌గా మారినా, మిల్లర్ నాటౌట్‌గా నిలిచినా ఫలితం మరోలా వచ్చే అవకాశం ఉంది. ఈ క్యాచ్ మ్యాచ్ విన్నింగ్ మూమెంట్ అని సూర్యను భారత క్రికెటర్లు, మాజీలు, అభిమానులు ప్రశంసించారు. కాగా, ఈ కళ్లుచెదిరే క్యాచ్ గురించి సూర్యకుమార్ స్పందించాడు. సిక్సర్‌గా వెళ్తున్న బంతి తనకి వరల్డ్ కప్‌లా కనిపించిందని, అది మిస్ అయితే కప్ చేజారుతుందేమో అని ఒడిసిపట్టానని సూర్య తెలిపాడు. "ఆ సమయంలో నా మైండ్‌లో ఏం ఆలోచన ఉందో నాకు తెలియదు. కానీ వరల్డ్ కప్ ఎగిరిపోతుందని కనిపించింది. దాన్ని ఒడిసిపట్టాను అంతే" అని సూర్య పేర్కొన్నాడు. కాగా, 1983 వరల్డ్ కప్‌లో భారత్ విజేతగా నిలవడంలో కపిల్ దేవ్ అందుకున్న స్టన్నింగ్ క్యాచ్ కీలక పాత్ర పోషించింది. అదే తరహాలో ఈ ప్రపంచకప్ గెలవడంలో సూర్య అందుకున్న క్యాచ్ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ క్రికెటర్లు సూర్యను కొనియాడుతున్నారు.





## పారిస్ ఒలింపిక్స్‌కు ముందు నీరజ్ చోప్రా కీలక నిర్ణయం

**పారిస్:** ప్రపంచ ఛాంపియన్, భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇటీవల పావో నుర్మి గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన నీరజ్.. త్వరలో జరుగబోయే పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనడం లేదు. సమాచారం మేరకు.. తొడ లోపలి కండరాల్లో సమస్య కారణంగా నీరజ్ లీగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించున్నాడు. టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. గత నెలలో జరిగిన పావో నుర్మి గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచాడు. ఒలింపిక్స్‌కు ముందు జరిగిన ఈ గేమ్స్‌లో నీరజ్ 85.97 మీటర్ల బెస్ట్ త్రోతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో నీరజ్ వెనుకబడినప్పటికీ మూడో ప్రయత్నంలో అద్భుతంగా పునరాగమనం చేసి చివరి వరకు ఆధిక్యాన్ని కొనసాగించడంలో సఫలమయ్యాడు.

# వింబుల్డన్ టోర్నీకి సబలెంక దూరం!


**లండన్:** వరల్డ్ మూడో నంబర్ అరినా సబలెంక ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టోర్నీ నుంచి వైదొలిగింది. తొలి మ్యాచ్‌లో అమెరికా అమ్మాయి ఎమినా బెక్తాస్‌తో సబలెంక తలపడాల్సింది. కానీ, భుజం గాయం కారణంగా టోర్నీలో పాల్గొనడం లేదని సోమవారం బెలారస్ భామ చెప్పింది. దాంతో, ఆమె స్థానంలో ఎరికా అండ్రీవా వింబుల్డన్ ఆడనుంది. మెగా టోర్నీ నుంచి ముందుగానే తప్పుకోవడంతో తన గుండె పగిలినంత బాధ ఉందని సంబలెంక అంది. 'విశ్రాంతి లేకుండా వింబుల్డన్‌కు వెళ్లితే గాయం మరింత తీవ్రమయ్యే అవకాశముందని వైద్య బృందం సూచింది. దాంతో, ఈ కఠిన నిర్ణయానికి వచ్చాన'ని సబలెంక వెల్లడించింది. టాప్ సీడ్‌లలో ఒకరైన సబలెంక గైర్హాజరీలో ఇగా స్వియాటెక్, కొకొ గాఫ్, ఎలీనా రాడుకానులలో ఒకరు చాం పియన్ అయ్యే చాన్స్ ఉంది.'నేను వంద శాతం ఫిట్‌నెస్‌తో లేను. ఈ ఏడాది వింబుల్డన్ ఆడట్లేదనే విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు బాధగా ఉంది. నేను ఎంతో ప్రయత్నించాను. ఈ టోర్నమెంట్ కోసం రోజంతా సాధన చేశా. కానీ, నా భుజం సహకరించడం లేదు. వింబుల్డన్ నాకు ఎంతో ముఖ్యమైనది. అయితే.. వచ్చే ఏడాది నేను మరింత బలంగా తిరిగొస్తానని మీకు ప్రామిస్ చేస్తున్నా' అని సబలెంక తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చింది.



## వాణిజ్య గ్యాస్ వినియోగదారులకు

# గుడ్ న్యూస్

**ముంబై:** వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు వరుసగా నాలుగో నెలలో తగ్గుముఖం పట్టాయి. నాలుగు మెట్రో నగరాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.30మేర తగ్గింది. మరోవైపు దేశీయ గ్యాస్ సిలిండర్ల ధరలు మార్చి 9 నుంచి నిలకడగా కొనసాగుతున్నాయి. గత 10 నెలల్లో ప్రభుత్వం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరను రూ.300 తగ్గించింది. రానున్న రోజుల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు ఉండదని అంచనా. మరోవైపు, రాబోయే నెలల్లో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర మరింత తగ్గే అవకాశం ఉంది. డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు ఎలా మారాయో తెలుసుకుందాం. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలో మార్చి నుంచి ఎలాంటి మార్పు లేదు. చివరిసారిగా మార్చి 9న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరలను రూ.100 తగ్గించారు. అంతకు ముందు ఆగస్టు 30న దేశవ్యాప్తంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గింది. గత 10 నెలలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరలో కేవలం రెండు మార్పులు మాత్రమే కనిపించాయి. ఈ క్రమంలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.300 తగ్గింది. మార్చి 1, 2023న గృహోపకరణ గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెరిగింది. ఈ మార్పు కూడా జూలై 6, 2022 తర్వాత కనిపించింది. అంటే గత రెండేళ్లలో కేవలం నాలుగు సార్లు మాత్రమే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో మార్పు వచ్చింది.




### వివిధ రాష్ట్రాల్లో రేట్లు ఇలా..

హైదరాబాద్లో 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 1872.5గా ఉంది. 14.5 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 855గా కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో దేశీయ గ్యాస్ సిలిండర్ ధర మార్చి 9, 2024 నుండి రూ.803 వద్ద కొనసాగుతోంది. కోల్‌కతాలో దేశీయ గ్యాస్ సిలిండర్ ధర మార్చి 9 నుండి గ్యాస్ సిలిండర్‌కు రూ. 829 వద్ద ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర అత్యల్పంగా ఒక్కో గ్యాస్ సిలిండర్ రూ.802.50గా ఉంది. మరోవైపు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర కోల్‌కతా తర్వాత అత్యధికంగా చెన్నైలో రూ.818.50గా ఉంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు వరుసగా నాలుగో నెలలో తగ్గుముఖం పట్టాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు చౌకగా లభిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.30 తగ్గగా, గ్యాస్ సిలిండర్ ధర రూ.1646 గా మారింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.31 తగ్గి రూ.1756కి చేరింది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.31 తగ్గి రూ.1598కి చేరింది. చెన్నైలో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.31 తగ్గగా, ధర రూ.1809.50కి తగ్గింది.

## రూ.7,755 కోట్ల విలువైన

# 2వేల నోట్లు ప్రజల వద్దే : ఆర్బీఐ

**ముంబై:** చలామణి నుంచి ఉపసంహరించుకున్న పెద్ద నోట్లు రూ.2 వేల కరెన్సీ నోట్లకు సంబం ధించి మరోసారి కీలక ప్రకటన చేసింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ. జూన్ 28, 2024 వ తేదీ వరకు రూ.2 వేల నోట్ల గణాంకాలను విడు దల చేస్తూ జులై 1, 2024 రోజున ఓ ప్రకటన విడు దల చేసింది. జూన్ 28 వరకు మొత్తంగా 97.87 శాతం మేర రూ.2 వేల నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చినట్లు తెలిపింది. ఇంకా ప్రజల వద్ద భారీగానే నోట్లు ఉన్నట్లు ఈ ప్రకటనతో అర్థమవుతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఇప్పటికీ ఇంకా చలామణిలో అంటే ప్రజల వద్ద సుమారు రూ. 7581 కోట్లు విలువైన 2000 కరెన్సీ నోట్లు ఉన్నాయి. ఈ మేరకు ఆర్‌బీఐ తన అధికారిక వెబ్‌సైట్‌లో రూ. 2 వేల నోట్లకు సంబంధించిన గణాంకాలను అప్డేట్ చేసింది.




చలామణిలో ఉన్న నోట్లు సంఖ్య గత నెల మే, 2024 తో పోలిస్తే జూన్ చివరి నాటికి 2.29 శాతం మేర పడిపోయినట్లు తెలిపింది. మే, 2024 నెల గణాంకాలు చూస్తే ఇంకా వెనక్కి రావాల్సిన నోట్లు రూ. 7,755 కోట్లు విలువైనవి ఉన్నాయి. ఇప్పటికీ చలామణిలో ఉన్న నోట్లకు చట్టబద్ధత ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. అయితే, వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయ్యాల్లో మాత్రమే మార్చుకునేందుకు వీలుంటుందని గుర్తుంచుకోవాలి. మే 19, 2023 రోజున రూ. 2 వేల కరెన్సీ నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటన చేసే నాటికి చలామణిలో రూ. 3.56 లక్షల కోట్లు విలువైన రూ.2వేల నోట్లు ఉన్నాయి. ఆ తర్వాత అక్టోబర్, 2023 వరకు బ్యాంకుల్లో మార్చుకోవడం, డిపాజిట్లు చేసేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న ఆర్‌బీఐకి చెందిన 19 ప్రాంతీయ కార్యాలయాల్లో మార్చేందుకు వీలు కల్పించింది. నేరుగా వెళ్లలేని వారు పోస్టాఫీసు ద్వారా నోట్లు పంపిస్తే వారి ఖాతాల్లో జమ చేస్తోంది.

# బీఎస్ఎన్ఎల్ యూజర్ల కోసం అదిరిపోయే ఆఫర్

**ముంబై:** దేశంలో అన్ని ప్రధాన టెలికాం సంస్థలు టారిఫ్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకున్నా యి. జియోతో పాటు ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడి యాలు సైతం భారీగా ధరలను పెంచాయి. పెరిగిన ఈ ధరలు జూల్ 4వ తేదీ నుంచి అమల్లోకి రాను న్నాయి. దీంతో మొబైల్ ఫోన్ యూజర్లపై భారీగా భారం పడడం ఖాయంగా కనిపిస్తోంది. టెలికం కంపెనీలు ఏకంగా 26 శాతం వరకు ధరలను పెంచేసింది. అయితే ఇదే సమయంలో ప్రముఖ కేంద్ర ప్రభుత్వ సంస్థ బీఎస్ఎన్ఎల్ యూజర్ల కోసం అదిరిపోయే ఆఫర్‌ను తీసుకొచ్చింది. తక్కువ ధరలో మంచి బెనిఫిట్స్‌తో కూడిన ఓ రీఛార్జ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. కొత్తగా రూ. 249 ప్లాన్‌ను తీసుకొ చ్చింది. ఇంతకీ ప్లాన్‌లో ఎలాంటి బెనిఫిట్స్ పొందొచ్చు. లాంటి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే. దేశంలోని ఏ నెట్‌వర్క్‌కి అయినా అన్‌లిమిటెడ్ కాల్స్ చేసుకోవచ్చు. 45 రోజు ల వ్యాలిడిటీ లభిస్తుంది. రోజుకు 2 జీబీ చొప్పున మొత్తం 90 జీబీ డేటా లభిస్తుంది. రోజుకు 100 ఉచిత ఎస్ఎమ్ఎస్‌లు లభిస్తాయి. ఇదిలా ఉంటే ఇదే రీఛార్జ్ ప్లాన్ ఎయిర్‌టెల్‌లో కూడా అందుబాటులో ఉంది. ఎయిర్‌టెల్‌లో ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 1 జీబీ డేటా లభిస్తుంది. అంతేకాకుండా వ్యాలిడిటీ మాత్రం 28 రోజులు మాత్రమే ఉంటుంది. ఎయిర్‌టెల్‌తో పోల్చితే బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌లో మరో 17 రోజులు అదనంగా లభిస్తుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఇతర టెలికం కంపెనీలు భారీగా ధరలను పెంచిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చిన ఈ కొత్త రీఛార్జ్ ప్లాన్ యూజర్లను ఆకర్షిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌లో ఉన్న యూజర్లను కాపాడుతూనే కొత్త వారికి అట్రాక్ట్ చేసేందుకు బీఎస్ఎన్ఎల్ ఈ నిర్ణయం తీసుకుంది.




Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657